# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 19-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:42 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

స్వచ్ఛతయే సేవ " యనుచు
స్వచ్ఛతనే గోరి జనులు సామాజికమౌ
స్వచ్ఛంద సేవ జేయగ
స్వచ్ఛతలో భారతమ్ము సంస్తుతులు గొనున్ !!

("స్వచ్ఛతయే సేవ" అనే నినాదంతో భారతదేశ ప్రజలు స్వచ్ఛందంగా భౌతిక మైన,నైతిక మైన స్వచ్ఛత కోసం ముందుకు వచ్చే కార్యక్రమం ప్రారంభమైంది. దీని వలన దేశానికి ఎంతో మేలు జరుగుతుంది.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

అబద్ధమో నిజమో
అంతా అయోమయం
అసెంబ్లీ సాక్షిగానే
అధికార భూమాయం.
అండ్ల ఇండ్ల ఎండ్లైనా
అగుపించే రాబందులే
సర్కారు భూములను
చెరబట్టిన కామందులే



-వేల్పుల నారాయణ
9440433475

# 100కు పైగా డిజైన్ బ్రాండ్లు..

## 150 మందికి పైగా నిపుణుల భాగస్వామ్యం



హైదరాబాద్, సెప్టెంబర్ 18: భారతదేశంలో ప్రముఖ డిజైన్ ఉత్సవంగా పేరొందిన డిజైన్ డెమోక్రసీ నాలుగో ఎడిషన్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 18, 19, 20 తేదీల్లో ఈ ఉత్సవం నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా 200కు పైగా ప్రముఖ డిజైన్ బ్రాండ్లు, ఆయా రంగాల్లో నిష్ణాతులైన 150 మందికి పైగా వక్తలు ఇందులో పాల్గొంటున్నారు. ఈ ఉత్సవాన్ని 30 వేల మందికి పైగా సందర్శిస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

ఆర్కిటెక్చర్, ఇంటీరియర్స్, ఫర్నిచర్, ఉత్పత్తి రూపకల్పన, లైటింగ్, ఫర్నిషింగ్స్, ఉపకరణాలు, కళలు, హస్తకళా నైపుణ్యం తదితర రంగాలకు డిజైన్ డెమోక్రసీ వేదికగా నిలుస్తోంది. 2026 ఎడిషన్‌ను ఇప్పటివరకు నిర్వహించిన ఉత్సవాల్లో అతిపెద్దదిగా, ప్రత్యేక అనుభూతిని అందించేలా రూపొందించారు. కాన్వాస్, మ్యూజ్, అటెలియర్, ఆల్కెమీ అనే నాలుగు విభిన్న హాళ్లలో ప్రదర్శనలు, ఇన్‌స్టాలేషన్‌లు, చర్చలు, ప్రత్యేక అనుభవాలను ఏర్పాటు చేశారు.

ఈ ఏడాది తెలంగాణ మ్యూజియం, సస్టైనబిలిటీ గ్యాలరీ, ప్రెషియస్ ఆబ్జెక్ట్స్, ది ఆర్ట్ ఎడిట్ వంటి ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. డిజైన్ హౌస్‌కు చెందిన సుప్రజ రావు తెలంగాణ మ్యూజియాన్ని, మ్యూజ్‌ల్యాబ్‌కు చెందిన జసేమ్ పిరానీ, హుజెఫా రంగ్వాలా సస్టైనబిలిటీ గ్యాలరీని, హ్యాబిటాట్ ఆర్కిటెక్ట్స్‌కు చెందిన మోనికా, సారా చౌదరి ప్రెషియస్ ఆబ్జెక్ట్స్‌ను, సాక్షి ఆర్ట్ గ్యాలరీ సహకారంతో అనీష్ గవాండే ది ఆర్ట్ ఎడిట్‌ను రూపొందించారు. గౌరాంగ్ షా, దివానీ, యావి తదితర ప్రముఖ బ్రాండ్లతో 'ది ఫ్యాబ్రిక్ ఆఫ్ డిజైన్' పేరిట ప్రత్యేక వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు.

డీడీ టాక్స్, డీడీ ఫోకస్ పేరిట చర్చలు, ఉపన్యాసాలు నిర్వహించనున్నారు. డిజైన్ భవిష్యత్తుపై కీలకోపన్యాసాలు, చర్చల్లో 150 మందికి పైగా ఆర్కిటెక్ట్‌లు, డిజైనర్లు, కళాకారులు, పారిశ్రామికవేత్తలు, మేధావులు పాల్గొంటారు. ప్రధాన వక్తల్లో అల్ఫాజ్ మిల్లర్, రవీందర్ రెడ్డి, సందీప్ ఖోస్లా, అంకోన్ మిత్రా, సుసాన్ ఖాన్ తదితరులు ఉన్నారు. భారీ బహిరంగ కళాకృతులు, అనుభవాత్మక ప్రదర్శనలు, పరిచయ కార్యక్రమాలతో పాటు కేఫ్‌లు, కాన్సెప్ట్ కిచెన్‌లు, క్రాఫ్ట్ బార్‌లతో 'ది గౌర్మెట్ జోన్'ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

డిజైన్ డెమోక్రసీ సహ వ్యవస్థాపకురాలు పల్లికా శ్రీవాస్తవ్ మాట్లాడుతూ గొప్ప డిజైన్‌కు స్ఫూర్తినిచ్చే, ప్రజలను అనుసంధానించే శక్తి ఉందనే నమ్మకంతో డిజైన్ డెమోక్రసీ ఏర్పడిందన్నారు. ఆలోచనలను పంచుకునే, భాగస్వామ్యాలను పెంపొందించే, సృజనాత్మకతను వేడుకగా జరుపుకునే వేదికగా ఇది ఎదిగిందని తెలిపారు. భారతీయ డిజైన్‌ను ప్రోత్సహిస్తూ దాని భవిష్యత్తును తీర్చిదిద్దే వ్యక్తులను ఒకచోట చేర్చే పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

సహ వ్యవస్థాపకురాలు శైల్జా పట్వారీ మాట్లాడుతూ భారతదేశపు డిజైన్ ప్రస్థానానికి సాహసోపేతమైన, వైవిధ్యభరితమైన వేదిక అవసరమన్నారు. ప్రతి ఎడిషన్‌తో కేవలం ఉత్సవాన్ని నిర్వహించడం కాకుండా కలిసి ఆలోచించే, ప్రశ్నించే, సృష్టించే సమాజాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. సహ వ్యవస్థాపకుడు అర్జున్ రాఠీ మాట్లాడుతూ జిజ్ఞాస, అర్థవంతమైన సంభాషణలను రేకెత్తించే అనుభవాలను సృష్టించడమే డిజైన్ డెమోక్రసీ ఉద్దేశమన్నారు. భారతీయ డిజైన్ గొప్పతనం, వైవిధ్యం, భవిష్యత్తును చాటిచెప్పేలా ప్రతి ప్రదేశం, ఇన్‌స్టాలేషన్, సంభాషణను రూపొందించినట్లు తెలిపారు.

డిజైన్ డెమోక్రసీ 2026కు పరిశ్రమలోని పలు సంస్థలు భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి. ది చార్‌కోల్ ప్రాజెక్ట్ టైటిల్ స్పాన్సర్‌గా, ఏషియన్ పెయింట్స్ ప్లాటినం స్పాన్సర్‌గా, బాండ్‌టైట్, పెంటాస్పేస్ గోల్డ్ స్పాన్సర్లుగా, టెక్నోజిమ్ సిల్వర్ స్పాన్సర్‌గా ఉన్నాయి. స్పెక్ట్రా, డివోర్, సన్‌రూఫ్, మాగ్పీ అసోసియేట్ స్పాన్సర్లుగా చేరాయి. శాటిలైట్ పార్టీకి క్యూస్, డీడీ టాక్స్‌కు అలేఖ్య హోమ్స్, లాంచ్ పార్టీకి వోక్స్, ఓూ స్పాన్సర్‌గా బ్రౌన్ ప్రొఫైల్స్, ఊూ స్పాన్సర్‌గా ఓఉ వ్యవహరిస్తున్నాయి.

2023లో ప్రారంభమైన డిజైన్ డెమోక్రసీ ప్రతి ఏడాది హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ప్రదర్శనలు, లీనమయ్యే ఇన్‌స్టాలేషన్‌లు, స్ఫూర్తిదాయకమైన సంభాషణలు, సాంస్కృతిక అనుభవాల ద్వారా దేశంలోని ప్రముఖ వాస్తుశిల్పులు, డిజైనర్లు, కళాకారులు, బ్రాండ్లు, సృష్టికర్తలను ఒకచోటకు తీసుకువస్తోంది. సృజనాత్మకతను వేడుకగా జరుపుతూ, సహకారాన్ని పెంపొందిస్తూ భారతదేశ డిజైన్ రంగాన్ని బలోపేతం చేసే వేదికగా డిజైన్ డెమోక్రసీ కొనసాగుతోంది.

# నేడే రోజ్‌గార్ మేళా..

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 18: యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రోజ్‌గార్ మేళాలో భాగంగా మరో కీలక కార్యక్రమం జరగనుంది. 20వ రోజ్‌గార్ మేళాలో భాగంగా 51 వేలకు పైగా కొత్తగా నియమితులైన యువతకు ప్రధాని నరేంద్ర మోదీ రేపు నియామక పత్రాలను అందజేయనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని, కొత్తగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

20వ రోజ్‌గార్ మేళా దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నియామక పత్రాలు అందుకోనున్న అభ్యర్థులు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల్లో విధుల్లో చేరనున్నారు. వీరిలో ఆదాయ పన్ను/రెవెన్యూ విభాగం, రైల్వే మంత్రిత్వ శాఖ, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, ఆరోగ్య?కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం, రక్షణ మంత్రిత్వ శాఖ తదితర విభాగాల్లో నియామకాలు పొందిన వారు ఉన్నారు.

యువతకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను అందించడం, దేశ అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంచడంపై కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న దృష్టికి రోజ్‌గార్ మేళా ప్రతీకగా నిలుస్తోంది. 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి ఇప్పటివరకు సుమారు 12.75 లక్షల మంది యువతకు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు, ప్రభుత్వ సంస్థల్లో నియామక పత్రాలు అందినట్లు కేంద్రం తెలిపింది. యువతకు ఉద్యోగ అవకాశాలు.. దేశాభివృద్ధిలో భాగస్వామ్యం అనే లక్ష్యంతో రోజ్‌గార్ మేళాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.గ

# పర్యావరణ పరిరక్షణతో పాటు వెదురు ఆధారిత వృత్తులను ప్రోత్సహించాలి

## ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించిన అదనపు కలెక్టర్లు సంగీత ,పాండు .



సంగారెడ్డి, సెప్టెంబర్ 18 (నేటి నిజం ప్రతినిధి)వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెదురుతో తయారు చేసిన వివిధ రకాల వస్తువుల ప్రదర్శనను అదనపు కలెక్టర్లు తిలకించారు. వెదురు ఉత్పత్తుల తయారీ, వాటి వినియోగం, సంప్రదాయ వృత్తుల పరిరక్షణకు సంబంధించిన వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో వెదురు మొక్కలు, వెదురు ఉత్పత్తులకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పర్యావం˘ణాన్ని పరిరక్షించడంతో పాటు వెదురు ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక అభివృద్ధికి తోడ్పడవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ఉపాధి కల్పన, సంప్రదాయ వృత్తుల పరిరక్షణకు వెదురు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

మేదర సామాజిక వర్గానికి చెందిన అనేక మంది వెదురు ఆధారిత వృత్తిని జీవనాధారంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయ వృత్తిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. వెదురుతో వివిధ రకాల ఉపయోగకరమైన వస్తువులను తయారు చేసి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను రూపొందించడం ద్వారా మరింత ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని అన్నారు. వెదురు ఉత్పత్తుల తయారీకి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

సామాజిక, ఆర్థిక అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని అదనపు కలెక్టర్లు అన్నారు. విద్యతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని కాలానుగుణంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ప్రభుత్వ విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఏ. జగదీష్,అదనపు డి ఆర్ డి ఓ బాల్ రాజ్,మాజీ మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయలక్ష్మి రవి, మేదరి మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షులు అంబదాస్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర, జిల్లా కోశాధికారి పులి రాజేష్ కుమార్, నాయకులు ఆంజనేయులు, రమేష్, నరేందర్, ప్రమోద్ కుమార్, సాయి మల్లేష్, శ్రీలత, జగదాంబ, సంతోషి, రజిని, మమత, బిక్షపతి, సిబ్బంది, మేదర సామాజిక వర్గ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణపై ఎల్‌నినోపై సీతక్క కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, సెప్టెంబర్ 18: ఎల్‌నినో ప్రభావం తెలంగాణపై కూడా ఉంటుందని.. ఇది కేవలం రాష్ట్ర సరిహద్దులకే పరిమితమైన పరిస్థితి కాదని మంత్రి సీతక్క అన్నారు. పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో వచ్చిన మార్పుల కారణంగా ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని.. ప్రపంచవ్యాప్తంగా దీని ప్రభావం కనిపిస్తోందని తెలిపారు. తెలంగాణలోనూ వర్షాభావ పరిస్థితులు.. నీటి లభ్యతపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ఎల్‌నినో విషయంలో ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆమె ఆరోపించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటల వైపు మళ్లాలని ప్రభుత్వం అవగాహన కల్పిస్తోందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వరి సాగు విస్తీర్ణం తగ్గిందని.. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై సూచనలు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రైతుల కోసం తక్కువ నీటి అవసరమయ్యే పంటలను ప్రోత్సహిస్తూ కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేస్తోంది.

ప్రస్తుతం రాష్ట్రంలో తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాల కోసం కాపాడుతున్నామని, కృష్ణా, గోదావరి బేసిన్‌లోని జలాశయాల ద్వారా ప్రజలకు తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. నీటి కొరతను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు కార్యాచరణతో పనిచేస్తోందని ఇప్పటికే మంత్రులు వెల్లడించారు. అదే సమయంలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు అందించాలని సీతక్క కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు కూడా కీలకంగా మారుతున్న నేపథ్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్రం 90 శాతం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటలు, తాగునీటి నిర్వహణ వంటి అంశాలపై కేంద్రం?రాష్ట్రం సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.

# డిజెఎఫ్ రాష్ట్ర మహాసభలకు సన్నాహాలు

## -వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ రఘునందన్‌రావు.



సంగారెడ్డి, సెప్టెంబర్ 18 (నేటి నిజం ప్రతినిధి)దళిత జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో అక్టోబర్ 7న సంగారెడ్డిలో నిర్వహించనున్న 11వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఎంపి రఘునందన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిజెఎఫ్ నాయకులు ఎంపీని కలిసి మహాసభలకు ఆహ్వానించారు.

పోతిరెడ్డిపల్లి ఎక్స్ రోడ్‌లోని పీఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మహాసభలు నిర్వహించనున్నట్లు డిజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తలారి యాదగిరి, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాపాక విజయరాజు, జిల్లా అధ్యక్షుడు రామని అశోక్ తెలిపారు. దళిత జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, సామాజిక న్యాయంపై మహాసభల్లో చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

దళిత జర్నలిస్టులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, అర్హులందరికీ అక్రిడిటేషన్, ఇళ్ల స్థలాలు, పిల్లలకు ఉచిత విద్య, కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం, ఉచిత బస్, రైలు పాసులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అభయహస్తం కింద రూ.12 లక్షలు, అకాల మరణం చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, నిరుద్యోగ భృతిగా నెలకు రూ.15 వేలు అందించాలని కోరారు. సీనియర్ దళిత జర్నలిస్టులకు నామినేటెడ్ పదవులతో పాటు ప్రెస్ అకాడమీ చైర్మన్, సభ్యులుగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

మహాసభలను విజయవంతం చేసేందుకు జర్నలిస్టులు, మేధావులు, ప్రజా సంఘాలు సహకరించాలని డిజెఎఫ్ నాయకులు కోరారు.

కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండాపురం జగన్, డిజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ దేవదాసు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ హెచ్. దాసు, జిల్లా కార్యదర్శి శంకర్, సలహాదారు మీనంపల్లి కిషన్‌రావు, జిల్లా కార్యదర్శి ముక్కగల్ల యాదన్న, జిల్లా ఉపాధ్యక్షుడు దానం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్ మసీదులో దారుణం.. 16 మంది మృతి



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 18:పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్, కొహాట్ జిల్లాలోని ఓ మసీదులో శుక్రవారం నమాజ్ సమయంలో సంభవించిన శక్తిమంతమైన ఆత్మాహుతి పేలుడు తీవ్ర కలకలం సృష్టించింది. ఈ దుర్ఘటనలో 16 మంది ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో భక్తులు తీవ్రంగా గాయపడ్డారు.

కొహాట్ జిల్లాలోని ఓల్డ్ పోలీస్ లైన్స్ సమీపంలో ఉన్న మసీదులో శుక్రవారం ప్రార్థనలు (జుమా నమాజ్) జరుగుతుండగా ఈ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి మసీదు భవనంతో పాటు సమీపంలోని భవనాలు, దుకాణాలు దెబ్బతిన్నాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న దృశ్యాల్లో మసీదు శిథిలాల నుంచి గాయపడిన వారిని రక్షించే దృశ్యాలు కనిపిస్తున్నాయి.

ప్రాథమికంగా 8 మంది చనిపోయినట్లు వార్తలు వచ్చినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం మృతుల సంఖ్య 16కు చేరింది. వీరిలో ఐదుగురు పోలీసులు కూడా ఉన్నారు. 50 మందికి పైగా గాయపడటంతో సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు.

'రెస్క్యూ 1122' సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ దాడికి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించలేదు.

# ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు.. హైకోర్టు సంచలన తీర్పు

హైదరాబాద్, సెప్టెంబర్ 18: తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో, కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగడాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, ఏలేటి మహేశ్వర్ రెడ్డి వేసిన పిటిషన్లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పునిచ్చింది.

కాగా.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి విజయం సాధించిన దానం నాగేందర్.. ఆ తర్వాత 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేశారు. ఈ నేపథ్యంలో దానంపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. అయితే దానం పార్టీ ఫిరాయింపునకు పాల్పడలేదంటూ స్పీకర్ ట్రైబ్యునల్ గతంలో తీర్పు ఇచ్చింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మహేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. 10వ షెడ్యూల్ ప్రకారం కాకుండా.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, ఆయనపై అనర్హత వేటు వేయాలని హైకోర్టును కోరారు. అలాగే, పార్టీ ఫిరాయింపులపైనా స్పీకర్‌కు పలు ఆధారాలు సమర్పించామని, వాటిని పరిగణలోనికి తీసుకోకుండా.. సరైన ఆధారాలు లేవని స్పీకర్ ట్రైబ్యునల్ మార్చి 11న ఉత్తర్వులు ఇచ్చిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

# జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత.. మహిళా కార్మికుల అరెస్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 18: నగరంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణను రాంకీ సంస్థకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని స్వచ్ఛ ఆటో కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు. అందుకు నిరసనగా శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ప్రధాన కార్యాలయం ముట్టడి కోసం వారంతా తరలి వచ్చి.. ఆందోళన చేపట్టారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించేందుకు ఆటో కార్మికులు ప్రయత్నించారు. వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్వచ్ఛ ఆటో కార్మికులు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దాంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మహిళా కార్మికులను పోలీసులు అరెస్ట్ చేశారు.

# నాట్య కళ : భారతీయ వారసత్వ సంపద

## (19 సెప్టెంబర్ "జాతీయ నాట్య దినోత్సవం" సందర్భంగా)

నాట్యం ఓ విశ్వ భాష. ప్రపంచ ప్రజలను ఏకం చేయగల శక్తివంతమైన సాంస్కృతిక సాధనం. నాట్యాన్ని మెచ్చని నరులుండరు. నాట్యం చేయడానికి వేదికను ఎక్కడం లేదా నాట్యాన్ని వీక్షించడానికి కళాభిమానిగా ప్రేక్షకుల మనస్సుల్లో దాగి ఉంటూ కళను ఆస్వాదించడం తరుచుగా చేస్తున్నాం. ఒక మహాద్భుత అనుభూతిని, ప్రేరణను, అమితానందాన్ని అందిస్తున్నది నాట్య కళ. వివిధ ప్రాంతాల, దేశాల ప్రజలు వేరు వేరు నాట్య రూపాలను ప్రోత్సహిస్తున్నారు లేదా ప్రచారం చేస్తూ ప్రదర్శనలు ఇస్తున్నారు. నాట్య కళ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని 2010లో అమెరికాలో ప్రారంభమై ప్రతి ఏట సెప్టెంబర్ మాసంలోని మూడవ శనివారం, అనగా 19 సెప్టెంబర్ 2026 రోజున విశ్వవ్యాప్తంగా "జాతీయ నాట్య దినోత్సవం" లేదా "నేషనల్ డాన్స్ డే"ను నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 29 ఏప్రిల్ రోజున యునెస్కో ప్రతిపాదించిన "అంతర్జాతీయ నాట్య దినం" కూడా పాటిస్తున్న విషయం మనకు తెలుసు.

### నాట్యకళకు 9,000 ఏండ్ల చరిత్ర:

స్వయం ప్రకటనకు నిలువెత్తు నిదర్శనం నాట్యం మాత్రమే. దాదాపు 9,000 ఏండ్ల క్రితమే ప్రారంభమైన నృత్య కళ నేడు అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రజల మన్నలు పొందుతున్నది. సాంస్కృతిక సరిహద్దులు చెరుపుతూ విశ్వవ్యాప్తం కావడం, వైవిధ్యభరితమైన మానవాళిని ఒకే వేదికపైకి తీసుకురావడం, కళాభిమానులకు మానసిక ప్రశాంతతను చేకూర్చడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన నాట్యకళ ఆనందాలు పంచుతూ దేహం, మనసు, హృదయం, ఆత్మలకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. నాట్యం ద్వారా వ్యక్తిగత అభినయం, శరీర భాగాల సమన్వయం, భావోద్వేగాలను ఆకర్షణీయంగా వ్యక్తీకరించడం, మానసిక ఒత్తిడిని తగ్గించడం జరుగుతుంది. నాట్యం చేయడం వల్ల మానసిక వికాసంతో పాటు కండరాలు బలపడడం, శరీర బరువు నియంత్రణ, శరీర కదలికలు, ఎముకల పటుత్వం, శరీర సమతుల్యత పెరగడం, హృదయనాళ ఆరోగ్యం, సామాజిక గుర్తింపు, మానసిక సంతోషం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి.

### భారతంలో వైవిధ్యభరిత నాట్యకళ:

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్న సువిశాల భారతంలో ఎన్నో శాస్త్రీయ, జానపద నాట్యాలు ప్రజాదరణను పొందాయి. భారత సంగీత అకాడమీ గుర్తించిన ఎనిమిది శాస్త్రీయ నృత్య కళల్లో భరతనాట్యం, కూచిపూడి, కథకుల, కథక్, ఒడిసి, మోహినీయాట్టం, మణిపురి, సత్రియాలు వస్తాయి. భారత దేశవ్యాప్తంగా 29 జానపద నాట్య కళారూపాలను గుర్తించినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో బహుళ ప్రచారం పొందిన జానపద నాట్యాల్లో విలాసిని, భామాకలాపం, వీర నాట్యం, డప్పు, తప్పెటగుళ్లు, లంబాడి, ధింసా, కోలాటం, పేరిణి, బుర్ర కథ, గుస్సాడి, చిందుల బాగోతం, బుట్ట బొమ్మలు, బోనాలు లాంటివి ఉన్నాయి.

డిజిటల్ యుగంలో నాట్య కళను సజీవంగా కొనసాగించడానికి ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థలు, స్వచ్ఛంద సంస్థలు చొరవను చూపాలి. నాట్యకళను యువతలో ప్రోత్సహించాలి. నాట్య కళాకారులను తగు రీతిలో గుర్తించడం, చిన్నారులకు నాట్య శిక్షణ ఇప్పించడం, నాట్య కళాశాలలను ఏర్పాటు చేయడం, నాట్య శిక్షణ ఇచ్చే గురువులను ప్రోత్సహించడం, నాట్య కళ పట్ల సమాజంలో చిన్న చూపును రూపుమాపడం లాంటి చర్యలు సత్వరమే తీసుకొని మన నాట్యకళా వారసత్వ సంపదను రాబోయే తరానికి అందించే ప్రయత్నాలు జరగాలి. నాట్య కళ ఆయా దేశాల లేదా ప్రాంతాల సాంస్కృతిక వారసత్వాలను ప్రపంచానికి చాటుతుంది. నేడే మన పిల్లలు, బంధువులు, స్నేహితులను డ్యాన్స్ తరగతుల్లో చేర్పిద్దాం. మనం నాట్యం నేర్చుకోలేక పోయినా, నాట్య కళను మాత్రం ప్రోత్సహిద్దాం.



-మధుపాళీ
9949700037

# స్వతంత్ర భారత చరిత్రలో హైదరాబాద్ సంస్థానం విమోచన ఓ కీలక ఘట్టం




న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 18: తెలంగాణలోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఇవాళ నిర్వహించిన 79వ హైదరాబాద్ విమోచన దినోత్సవంలో ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ- స్వతంత్ర భారత చరిత్రలో ఒక కీలక ఘట్టానికి హైదరాబాద్ విమోచనం ముగింపు పలికిందని ఉపరాష్ట్రపతి గుర్తు చేశారు. ఈ మేరకు 1948 సెప్టెంబరు నాటి పరిణామాలు, 'ఆపరేషన్ పోలో' అనంతరం ఈ సంస్థానం భారత రాష్ట్రాల సమాఖ్యలో విలీనం కావడాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో నేటి వేడుక ఒక చారిత్రక తేదీ సంస్మరణకు మాత్రమే పరిమితం కాబోదన్నారు. ఇది భారత ప్రగతి ప్రస్థానాన్ని, దేశ సమైక్యతను సమున్నతంగా నిలిపే విలువలను గుర్తుచేసే సందర్భమని ఆయన అభివర్ణించారు.

విభిన్న రాజకీయ పరిస్థితుల నడుమ ఎన్నో సంఘర్షణలకు గురైన ప్రజలను ఏకతాటిపైకి తేవడంలో ఒక నవ స్వతంత్ర దేశం ఎదుర్కొన్న అసంఖ్యాక సవాళ్లను హైదరాబాద్ చరిత్ర ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామాన్ని రాజనీతిజ్ఞత, ధైర్యం, త్యాగాల గాథగా పేర్కొంటూ- ప్రతి పౌరుడికీ సమాన స్థాయినిచ్చే రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య సౌధం నిర్మించే దిశగా నిరంతర, బృహత్తర ప్రక్రియ కొనసాగిందని గుర్తుచేశారు.

జాతీయ సమగ్రత దిశగా సర్దార్ వల్లభాయ్ పటేల్ అవిరళ కృషిని ప్రస్తావిస్తూ- విభజన విషాదం నుంచి దేశం కోలుకుంటున్న వేళ భారత తొలి హోం శాఖ మంత్రిగా ఆయన అసాధారణ కర్తవ్య నిర్వహణ సదా స్మరణీయమన్నారు. వందలాది సంస్థానాలను ఒకే సమాఖ్యగా రూపొందించడంలో సంస్థానాల శాఖ మంత్రిగానూ తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించారని ఉపరాష్ట్రపతి చెప్పారు. "ఈ సంస్థాన విమోచనం ద్వారా బలమైన, ఏకీకృత సమైక్య భారతానికి శ్రీ సర్దార్ పటేల్ దృఢమైన పునాది వేశారు" శ్రీ సి.పి.రాధాకృష్ణన్ వ్యాఖ్యానించారు.

దేశ పురోగమనంలో వివిధ దశలను పోలుస్తూ- "స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ కీలక పాత్ర పోషించారు. అటుపైన ఆధునిక భారతంతో సంస్థానాల ఏకీకరణకు శ్రీ సర్దార్ పటేల్ ఎనలేని కృషి చేశారు. తదుపరి తరంలో నేడు 'వికసిత భారత్-2047' దిశగా ప్రస్థానానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సమర్థ సారథ్యం వహిస్తున్నారు" అని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

హైదరాబాద్ విమోచన నేపథ్యంలో సాగిన ప్రజా ఉద్యమాన్ని కొనియాడుతూ- ఆనాడు విద్యార్థులు, మేధావులు, రచయితలు, సామాజిక-రాజకీయ కార్యకర్తలు, రైతులు సహా సామాన్య పౌరులు కూడా ఈ పోరాటంలో భాగస్వాములయ్యారని శ్రీ సి.పి.రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఈ క్రమంలో అనేకమంది కఠిన కారాగార వాసం, హింస, అంతులేని వ్యక్తిగత కష్టనష్టాలకు గురయ్యారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా రామ్‌జీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్, కొమురం భీమ్ వంటి దేశభక్తులకు నివాళి అర్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు లేదా ప్రసిద్ధ రాజనీతిజ్ఞుల ద్వారా మాత్రమే చరిత్రకు రూపం ఏర్పడదన్నారు. అన్యాయాన్ని విధి లిఖితంగా అంగీకరించని సామాన్యుల ధైర్యసాహసాలు కూడా చరిత్రను సృష్టించగలవని స్పష్టం చేశారు.

ఈ మేరకు "రాజకీయ ఏకీకరణ భూభాగాలను ఏకం చేయగలదు.. అయితే, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం పౌరులందర్నీ ఏకతాటిపైకి తెస్తుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. కేవలం భౌగోళిక సరిహద్దులతో జాతీయ ఐక్యత సాధ్యం కాదంటూ- సమాన హక్కులు, గౌరవం, అవకాశాల ద్వారా దాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతయినా ఉందని శ్రీ సి.పి.రాధాకృష్ణన్ ప్రస్ఫుటం చేశారు.

దేశ ఐక్యత కోసం ప్రతి పౌరులందరూ ఒకే రీతిలో ఉండాల్సిన అవసరం లేదని, భిన్న భాషలు.. విభిన్న సంప్రదాయాలు, విశ్వాసాలు గలవారై ఉండవచ్చునని చెప్పారు. అలాగే, భిన్న రాజకీయ అభిప్రాయాల గలవారు కావచ్చునని, అంతిమంగా రాజ్యాంగం, సార్వభౌమాధికారం ప్రజలకే చెందుతాయనే వాస్తవమే వారిని ఏకతాటిపై నిలుపుతుందని స్పష్టం చేశారు.

కేంద్ర సాయుధ పోలీసు బలగాల పాత్రను ప్రస్తావిస్తూ- సంస్థానాల ఏకీకరణ సందర్భంగా 1947-48లోనే కాకుండా భారత ప్రాదేశిక సమగ్రత పరిరక్షణలోనూ కీలక పాత్ర పోషించారని ఉపరాష్ట్రపతి అన్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ తదితర వామపక్ష ప్రభావిత ప్రాంతాల్లో తీవ్రవాదాన్ని రూపమాపడంలో వారి త్యాగాలను కూడా ఆయన కొనియాడారు. ఏకీకరణ సార్వజనీనతకు బాటలు వేయాలని, దేశ సేవలోనే అంతిమంగా దేశభక్తి అత్యున్నత రూపం కనిపించేలా హైదరాబాద్ వారసత్వం గుర్తుచేస్తుందని ఉపరాష్ట్రపతి అన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ విమోచన, ఏకీకరణకు దోహదపడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, వారి త్యాగాలకు, ధైర్యసాహసాలకు ఉపరాష్ట్రపతి గౌరవపూర్వక నివాళి అర్పించారు.

హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కవాతులో సాయుధ దళాల గౌరవ వందనాన్ని ఉపరాష్ట్రపతి స్వీకరించారు. అద్భుత క్రమశిక్షణతో సాగిన కవాతు సహా భావోద్వేగభరిత సాంస్కృతిక ప్రదర్శనలను ఆయన వీక్షించారు. దేశ ప్రగతి ప్రస్థానంలోని ఈ చారిత్రక ఘట్టంలో భాగస్వాములైన వారి ధైర్యసాహసాలకు, దృఢ సంకల్పానికి నివాళిగా హైదరాబాద్ విమోచన, ఏకీకరణ సమయంలో ప్రజల పోరాటం, శౌర్యం, త్యాగాలను ఈ సాంస్కృతిక ప్రదర్శనలు కళ్లకు కట్టాయి.

## భారతీయ తపాలా శాఖ సాధించిన పరివర్తనను వివరిస్తూ రాసిన కథనాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 18: ఆధునిక, సాంకేతికత ఆధారిత, వృత్తిపరంగా నిర్వహించే సంస్థగా భారతీయ తపాలా శాఖ రూపాంతరం చెందిన విధానాన్ని వివరిస్తూ కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం సింధియా రాసిన ఒక కథనాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకున్నారు. రవాణా, ఆర్థిక సేవలు, పౌర కేంద్రీకృత సేవల విభాగాల్లో తపాలాశాఖ తన విస్తృత సేవా పరిధిని డిజిటల్ సామర్థ్యాలతో అనుసంధానిస్తోందని ఈ వ్యాసం పేర్కొంది.

"శ్రీ జ్యోతిరాదిత్య ఎం సింధియా రాసిన ఈ కథనంలో భారతీయ తపాలా శాఖ ఆధునిక, సాంకేతికత ఆధారిత, వృత్తిపరంగా నిర్వహించే సంస్థగా మారుతున్న తీరును వివరించారు. రవాణా, ఆర్థిక సేవలు, పౌర ఆధారిత సేవల విభాగంలో భారతీయ తపాలా శాఖ తన విస్తృతమైన వ్యవస్థను డిజిటల్ సామర్థ్యాలతో మేళవిస్తోందని ఆయన వివరించారు. సరిగ్గా అదే సమయంలో 'డాక్ సేవా, జన్ సేవా' స్ఫూర్తితో విశ్వసనీయ ప్రజా సేవా పాత్రను ఇది నిరంతరం నిలబెట్టుకుంటోంది"

## పంట క్షేత్రాల్లో గంజాయి గుప్పు

### రూ.38.50 లక్షల విలువైన 385 మొక్కలు స్వాధీనం..



ఆదిలాబాద్, సెప్టెంబర్ 18: వ్యవసాయ పంట క్షేత్రాల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగు చేస్తున్న గంజాయిపై ఆదిలాబాద్ పోలీసులు శుక్రవారం మెరుపు దాడులు నిర్వహించారు. ముందస్తు సమాచారంతో రెండు చోట్ల చేపట్టిన తనిఖీల్లో 385 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.38.50 లక్షలు ఉంటుందని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించిన మెస్రం గంగారాం పటేల్, మెస్రం నాగుపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొటంలొద్ది గ్రామ శివారులో మెస్రం గంగారాం పటేల్‌కు చెందిన వ్యవసాయ పొలంలో తనిఖీలు నిర్వహించగా 315 గంజాయి మొక్కలు గుర్తించారు. వ్యవసాయ విస్తరణ అధికారి పరిశీలించి అవి గంజాయి మొక్కలేనని నిర్ధారించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.31.50 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఇదే సమయంలో మరో వ్యవసాయ పొలంలో మెస్రం నాగు గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించి తనిఖీలు చేపట్టగా 70 మొక్కలు లభించాయని, వాటి విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

రెండు కేసుల్లోనూ నిందితులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. వారిపై మాదకద్రవ్యాల నేరాలకు సంబంధించి చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాను గంజాయి రహిత ప్రాంతంగా మార్చేందుకు పోలీసులు పక్కా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. గంజాయి సేవించినా, అక్రమంగా రవాణా చేసినా, సాగు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిందితులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా సిఫారసు చేస్తామని తెలిపారు.

ఎక్కడైనా గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్పీ కోరారు. సమాచారం అందించిన వారికి నజరానా ఇస్తామని తెలిపారు. గంజాయి నిర్మూలన కోసం పోలీసు యంత్రాంగం ఉద్యమంలా పనిచేస్తుందని చెప్పారు. ఫిర్యాదులు, సమాచారం కోసం 8712659973 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఆకస్మిక దాడుల్లో ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా, ఎస్సై వి. విష్ణువర్ధన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మీడియా సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, రూరల్ ఎస్సై వి. విష్ణువర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య విద్యలో ట్రినిటీ విద్యార్థుల విజయ పరంపర..

### 35 మందికి పైగా ఎంబీబీఎస్ సీట్లు

### 2026లో మరో 8 మందికి వైద్య విద్యలో ప్రవేశం

ఆదిలాబాద్, సెప్టెంబర్ 18: లక్సెట్టిపేట ట్రినిటీ హైస్కూల్ విద్యార్థులు వైద్య విద్యలో వరుస విజయాలు సాధిస్తూ పాఠశాల ప్రతిష్ఠను ఇనుమడింప జేస్తున్నారని ట్రినిటీ పాఠశాలల డైరెక్టర్ చిన్నపరెడ్డి అన్నారు. శుక్రవారం లక్సెట్ పేట ట్రినిటీ పాఠశాలలో చదివి ఉన్నత స్థాయిలో వైద్య వృత్తిలో చదువుతున్న విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాటాడారు. ట్రినిటీ పాఠశాల నుంచి ఇప్పటివరకు 35 మందికి పైగా విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించి, వైద్యులుగా ఎదిగారని తెలిపారు. 2026లోనూ మరో 8 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. ట్రినిటీ పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణ, పట్టుదలతో ను సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పాఠశాల పూర్వ విద్యార్థుల్లో 10 నుంచి 15 మంది వైద్యులు పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి వైద్య రంగంలో ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు. మరో 15 మంది విద్యార్థులు బీడీఎస్, హోమియోపతి తదితర వైద్య విభాగాల్లో ప్రవేశాలు పొంది తమ భవిష్యత్తును నిర్మించుకుంటున్నారని వెల్లడించారు. అనంతరం ట్రినిటీ హైస్కూల్ ప్రిన్సిపల్ జోసెఫ్ మాట్లాడుతూ విద్యార్థుల విజయాలు పాఠశాల విద్యా ప్రమాణాలకు, వారి కృషికి నిదర్శనమని అన్నారు. వైద్య విద్యలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభ ట్రినిటీ కుటుంబానికే కాకుండా లక్సెట్టిపేట ప్రాంతానికే గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు సిబ్బంది తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సుస్థిర, ప్రతికూల పరిస్థితులను తట్టుకునే వ్యవసాయ పద్ధతుల పై హైదరాబాద్‌లో దక్షిణాది జోనల్ వ్యవసాయ సదస్సు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 18:సుస్థిర, ప్రతికూల పరిస్థితులను తట్టుకునే వ్యవసాయ పద్ధతులకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించేందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దక్షిణాది జోనల్ వ్యవసాయ సదస్సు సెప్టెంబర్ 18న హైదరాబాద్‌లో నిర్వహించనుంది. ఈ సదస్సులో కేంద్ర ప్రభుత్వం, దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, వ్యవసాయ నిపుణులు, ఐసీఏఆర్ సంస్థలు, ప్రగతిశీల రైతులు, ఇతర భాగస్వామ్య వర్గాలు పాల్గొననున్నాయి.

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయ మంత్రులు శ్రీ రామ్‌నాథ్ ఠాకూర్, శ్రీ భగీరథ్ చౌధరి ఈ సదస్సుకు హాజరుకానున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలతో పాటు అండమాన్-నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులు కూడా సదస్సులో పాల్గొంటారు.

డిజిటల్ వ్యవసాయం, రైతు రిజిస్ట్రీ, అధిక విలువ కలిగిన ఉద్యాన పంటలు, విలువ జోడింపు, వంట నూనెలు మరియు పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వావలంబన, ప్రకృతి వ్యవసాయం, సమగ్ర వ్యవసాయ విధానాలు, సమతుల్య ఎరువుల వినియోగం, నకిలీ పురుగుమందులు మరియు ఎరువుల నియంత్రణ వంటి కీలక అంశాలపై సదస్సులో చర్చ జరగనుంది.

దక్షిణాది రాష్ట్రాలు తమ వినూత్న కార్యక్రమాలు, ఉత్తమ విధానాలను సదస్సులో ప్రదర్శించనున్నాయి. తెలంగాణ రైతునేస్తం, ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ వైవిధ్యాన్ని ఎదుర్కొనే విధానాలు, కర్ణాటకలో పప్పుధాన్యాల ఉత్పత్తి మెరుగుదల పద్ధతులు, కేరళలో సేకరణ మరియు మార్కెట్ కార్యక్రమాలు, తమిళనాడులో ఖచ్చితత్వ వ్యవసాయం, హైటెక్ వ్యవసాయ విధానాలు ఇందులో ప్రదర్శించనున్నారు. కేంద్రం-రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, విజయవంతమైన కార్యక్రమాలు మరియు ఉత్తమ విధానాల పరస్పర మార్పిడి, వాటిని ఇతర ప్రాంతాల్లో అమలు చేసేందుకు వీలు కల్పించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యాల్లో భాగంగా ఉంది. వ్యవసాయ రంగంలో స్వావలంబన, అధిక విలువ కలిగిన ఉద్యాన పంటల ప్రోత్సాహం, డిజిటల్ మరియు వాతావరణ ప్రతిఘటనశీల వ్యవసాయం, అలాగే నిల్వ, ప్రాసెసింగ్, విలువ జోడింపు, మార్కెటింగ్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు అవసరమైన వ్యూహాల రూపకల్పనకు ఈ సదస్సు దోహదపడనుంది.

## భారత అభివృద్ధి ప్రస్థానంలో నీలి విప్లవం మరో విజయగాథగా నిలుస్తోందని వివరించే వ్యాసాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18:ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ రాసిన ఒక కథనాన్ని ప్రధామంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు పంచుకున్నారు. శ్రీ మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి ప్రస్థానంలో 'నీలి విప్లవం' మరో విజయగాథగా మారుతోందని శ్రీ సీపీ రాధాకృష్ణన్ తన వ్యాసంలో పేర్కొన్నారు. భారత్ నేడు తన తీర ప్రాంతాలను దాటి సముద్ర వనరులను సద్వినియోగం చేసుకునే దిశగా ముందుకు సాగుతోందని ఈ కథనం పేర్కొంది. సుస్థిర మత్స్యరంగం ద్వారా తీర ప్రాంతాల్లోని ప్రజలు, యువత, మహిళలకు కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని, తద్వారా తీర ప్రాంత భారతదేశ ఆర్థిక జీవనం మరింత బలోపేతమవుతోందని ఆయన తెలిపారు.'ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ రాసిన ఈ కథనం తప్పక చదవాల్సినది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి ప్రస్థానంలో 'నీలి విప్లవం' మరో విజయగాథగా మారుతోందని ఆయన పేర్కొన్నారు. భారత్ నేడు తన తీరప్రాంత సరిహద్దులను దాటి సముద్ర వనరులను సద్వినియోగం చేసుకునే దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. సుస్థిర మత్స్యరంగం తీర ప్రాంతాల్లోని ప్రజలు, యువత, మహిళలకు కొత్త అవకాశాలను సృష్టిస్తోందని, ఇది తీర ప్రాంత భారతదేశ ఆర్థిక జీవనాన్ని కూడా బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు".

## విచ్ఛిన్న ప్రపంచంలో కూటములను నిర్మించడంలో భారత్ అనుసరిస్తున్న విధానాన్ని తెలియజేసే కథనాన్ని పంచుకున్న ప్రధాని

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 18:ఆర్‌పీజీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ శ్రీ హర్ష్ గోయెంకా రాసిన కథనాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ఈ రోజు పంచుకున్నారు. విచ్ఛిన్న ప్రపంచంలో కూటములను నిర్మించడంలో, పోటీ శక్తులతో సంబంధాలను సమతుల్యం చేయడంలో, భారతదేశ వ్యూహాత్మక ఆసక్తులను ముందుకు తీసుకెళ్లడంలో ప్రధానమంత్రి అనుసరిస్తున్న విదేశాంగ విధానం ఎలా దృష్టి సారిస్తుందో ఈ వ్యాసంలో శ్రీ హర్ష్ గోయెంకా వివరించారు.విచ్ఛిన్న ప్రపంచంలో కూటములను నిర్మించడం, పోటీ శక్తులతో సంబంధాలను సమతుల్యం చేయడం, అదే సమయంలో భారతదేశ వ్యూహాత్మక ఆసక్తులను ముందుకు తీసుకెళ్లడమే పీఎం నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానమని ఆర్‌పీజీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ శ్రీ హర్ష్ గోయెంకా పేర్కొన్నారు.బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో న్యూఢిల్లీ ప్రకటనను ఆమోదించడమే భారత్ అనుసరిస్తున్న ఐక్య వేదిక నిర్మాణ విధానానికి నిదర్శనమని ఆయన తెలియజేశారు."

# సొంత అవసరాల కోసం కేటాయించిన బొగ్గు గనుల అభివృద్ధిని వేగవంతం చేయాలి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18:ఉత్తరప్రదేశ్‌లో బొగ్గు సరఫరా నిలిచిపోవటం వల్ల తీవ్రమైన విద్యుత్ కొరత ఏర్పడిందని ఇటీవల మీడియా కథనాలు వెల్లడించాయి. రాష్ట్ర అవసరాలు తీర్చేందుకు తగినంత బొగ్గును కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) అందిస్తున్నప్పటికీ వాస్తవ పరిస్థితిని స్పష్టం చేయటానికి, సొంత అవసరాలకు కేటాయించిన గనుల అభివృద్ధిని వేగవంతం చేయాలని తెలిపేందుకు బొగ్గు మంత్రిత్వ శాఖ పలు అంశాలను నమోదు చేస్తోంది.

15.09.2026 నాటికి ఉత్తరప్రదేశ్ రాజ్య విద్యుత్ ఉత్పాదన నిగమ్ లిమిటెడ్ (యూపీఆర్వీయూఎన్ఎల్)కు సంబంధించిన థర్మల్ పవర్ ప్లాంట్లలో ఎక్కడా బొగ్గు నిల్వలు నిండుకోలేదు. కాబట్టి ప్రస్తుత నిల్వ స్థితికి సంబంధించి ప్లాంట్ స్థాయిలో బొగ్గు లభ్యతకు సంబంధించి ఎలాంటి అత్యవసర పరిస్థితులు లేవు.

సొంత అవసరాల కోసం కేటాయించిన గనుల అభివృద్ధిని వేగవంతం చేయాల్సిన యూపీ

జార్ఖండ్‌లోని దుమ్కా జిల్లాలో 973 మిలియన్ టన్నులకుపైగా నిల్వలున్న సహార్‌పూర్ జమర్‌పాని బొగ్గు బ్లాక్‌ను, ఉత్తరప్రదేశ్ రాజ్య విద్యుత్ ఉత్పత్తి నిగమ్ లిమిటెడ్ (యూపీ ఆర్వీ యూఎన్ఎల్) థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల బొగ్గు అవసరాలను తీర్చేందుకు కేటాయించారు. బొగ్గు గనుల (ప్రత్యేక నిబంధనలు) చట్టం-2015 ద్వారా 13.08.2015న బొగ్గు మంత్రిత్వ శాఖ యూపీ ఆర్వీ యూఎన్ఎల్‌కు కేటాయించింది.

ఈ బ్లాక్ కేటాయించి పదేళ్లు గడుస్తున్నా యూపీఆర్వీయూఎన్ఎల్ నుంచి ఎలాంటి కార్యాచరణ లేకపోవటం వల్ల పురోగతి జరగలేదు. ఫలితంగా ఉత్తరప్రదేశ్ విద్యుత్ కేంద్రాల పూర్తి బొగ్గు అవసరాలు ఇప్పటికీ సీఐఎల్ ద్వారానే తీరుతున్నాయి.

సహార్‌పూర్ జమర్‌పాని కేటాయింపు తర్వాత విద్యుత్ రంగంలో సొంత వినియోగానికి కేటాయించిన పద్నాలుగు ఇతర బొగ్గు బ్లాకులు ఇప్పటికే కార్యరూపం దాల్చాయి. అనుబంధ ప్లాంట్ల కోసం బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించాయి. విద్యుత్ ప్లాంట్లకు దీర్ఘకాలిక ఇంధన భద్రతను చేకూర్చేందుకు, బాహ్య వనరులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు సహార్‌పూర్ జమర్‌పాని బ్లాక్ అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని బొగ్గు మంత్రిత్వ శాఖ కోరింది.

బొగ్గు సరఫరా స్థితి: యూపీఆర్వీయూఎన్ఎల్‌కు పూర్తి మద్దతిస్తున్న సీఐఎల్

యూపీఆర్వీయూఎన్ఎల్ థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు క్రమంగా మెరుగుపడుతున్నాయి. సెప్టెంబర్ 1, 2026 నాటికి 7.25 లక్షల టన్నులు (ఎల్‌టీ)గా ఉన్న బొగ్గు నిల్వలు, సెప్టెంబర్ 15 నాటికి 8.41 లక్షల టన్నులకు పెరిగాయి. గత ఏడు రోజుల్లో రోజువారీ సగటు బొగ్గు వినియోగం సుమారు 0.83 లక్షల టన్నులు ఉండగా, రోజువారీ సగటు బొగ్గు రాక సుమారు 0.90 లక్షల టన్నులుగా ఉంది. ఇది నిల్వలు నిరంతరం పెరుగుతున్నట్లు తెలియజేస్తుంది.

ఈ మెరుగుదల రైల్వే సరఫరాల నిరంతర కొనసాగింపులో కూడా స్పష్టంగా కనిపిస్తుంది. గత 10 రోజుల్లో యూపీ ఆర్వీయూఎన్ఎల్ విద్యుత్ కేంద్రాలకు రోజుకు సగటున దాదాపు 17.7 రేక్స్ చొప్పున సీఐఎల్ సరఫరా చేసింది. థర్మల్ పవర్ ప్లాంట్ల (టీపీపీలు) వద్ద నిల్వలను మరింత పెంచేందుకు సీఐఎల్ 03.09.2026న యూపీఆర్వీయూఎన్ఎల్‌తో సహా అన్ని జెన్‌కోలు, ఐపీపీలకు రోడ్డు, ఆర్‌సీఆర్ పద్ధతిలో అదనపు బొగ్గును అందించింది.

వివిధ ప్లాంట్ల వద్ద అన్-లోడింగ్ ఇబ్బందుల వల్ల రైల్వే వారు ఎప్పటికప్పుడు రేక్స్ నిల్వపై ఆంక్షలు విధిస్తున్నారు. దీనివల్ల బొగ్గు సరఫరాను పెంచేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

బొగ్గు నిల్వలు 8 ఎల్‌టీలకు పైగా పెరిగినప్పటికీ, యూపీ ఆర్వీయూఎన్ఎల్ థర్మల్ విద్యుత్ కేంద్రాల ప్రస్తుత నెల ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) కేవలం 48 శాతంగానే ఉంది. ప్రస్తుత నెలలో విద్యుత్ ఉత్పత్తి తగ్గటానికి కారణం... ప్లాంట్ వద్ద సరిపడా బొగ్గు నిల్వలు లేకపోవటం కాదు. విద్యుత్ ఉత్పత్తి మెరుగుపడాలంటే విద్యుత్ కేంద్రాల వద్ద ఉన్న నిర్వహణ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి. అందుబాటులో ఉన్న బొగ్గు నిల్వలను అత్యంత సమర్థవంతంగా వినియోగించుకోవాల్సి ఉంటుంది.

ఉత్తరప్రదేశ్‌తో పాటు దేశం మొత్తానికి బొగ్గును సరఫరా చేసేందుకు బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ ఇండియా లిమిటెడ్ పూర్తిగా కట్టుబడి ఉన్నాయి. థర్మల్ పవర్ ప్లాంట్ల కోసం దీర్ఘకాలిక ఇంధన భద్రతను పెంపొందించుకునేందుకు, బాహ్య బొగ్గు వనరులపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు, సహార్‌పూర్ జమర్‌పాని వద్ద ఉన్న సొంత వినియోగ బొగ్గు గనుల అభివృద్ధికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రిత్వ శాఖ సూచిస్తోంది.

# చెట్ల పొదల్లో కాలిపోయిన మహిళ మృతదేహం లభ్యం

కరీంనగర్, సెప్టెంబర్ 18:: కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం కలకలం రేపింది. కృష్ణానగర్‌లోని కల్యాణి గార్డెన్ ముందు ఉన్న గల్లీలో చెట్ల పొదల్లో బుధవారం సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతురాలు సుమారు 30 నుంచి 40 ఏళ్ల వయస్సు గల మహిళగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే మృతదేహం పూర్తిగా కాలిపోయి ఉండటంతో ఆమెను గుర్తించడం సాధ్యం కాలేదు.

పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించారు. పరిసర ప్రాంతాల ప్రజలను పిలిపించి మృతురాలిని గుర్తించేందుకు ప్రయత్నించినప్పటికీ ఎలాంటి సమాచారం లభించలేదు. అనంతరం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మహిళ మృతికి సంబంధించిన కారణాలు, ఆమె అక్కడికి ఎలా వచ్చిందనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మృతురాలి వివరాలు తెలిసిన వారు లేదా తమ కుటుంబ సభ్యులు ఎవరైనా కనిపించకుండా పోయిన వారు ఉంటే కరీంనగర్ రూరల్ పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ అనుముల నిరంజన్ రెడ్డి కోరారు. సమాచారం ఉంటే 8712670764 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# భీమేశ్వరుడిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 18:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ దేవాలయమైన భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ఈఓ ఎల్. రమాదేవి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేసి ఘనంగా సత్కరించారు. స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని అర్చకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తోము మధు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏ అమలుకు వీలుగా న్యూజిలాండ్ చట్టం ఆమోదం పొందడాన్ని స్వాగతించిన భారతదేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 :భారత్, న్యూజిలాండ్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్ టీఏ) అమలుకు వీలుగా న్యూజిలాండ్ పార్లమెంట్ 2026 సెప్టెంబర్ 16న నూతన చట్టాన్ని ఆమోదించడాన్ని భారతదేశం స్వాగతించింది. ఈ ఒప్పందంపై 2026 ఏప్రిల్ 27న ఢిల్లీలో ఇరు దేశాలు సంతకం చేశాయి. ఈ ఒప్పందాన్ని అమలు చేయటంలో ఈ చట్టం ఆమోదం పొందడం ఒక కీలకమైన ఘట్టం. ఇది తమ ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింతగా దృఢంగా, విస్తృతంగా చేయడానికి భారత్, న్యూజిలాండ్‌ల ఉమ్మడి నిబద్ధతను తెలియజేస్తుంది.

నాలుగు దశాబ్దాల కాలంలో ఏ భారతీయ ప్రధాని చేయని విధంగా 2026 జూలైలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ న్యూజిలాండ్‌లో పర్యటించడం ద్వైపాక్షిక సంబంధాలకు మరింత ఊపునిచ్చింది. ఈ పర్యటన సందర్భంగా ఇద్దరు ప్రధాన మంత్రులు ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. భారత్- న్యూజిలాండ్ ఎఫ్‌టీఏను త్వరగా అమలు చేయాల్సిన ప్రాముఖ్యతను ప్రధానంగా పేర్కొన్నారు.

బలమైన ప్రజా సంబంధాలు, వాణిజ్యం, పెట్టుబడులు, వ్యవసాయం, విద్య, క్రీడలు, సాంకేతికత, ఇతర రంగాల్లో విస్తరిస్తున్న సహకారంతో కూడిన సుదీర్ఘమైన, సన్నిహిత సంబంధాలను భారత్, న్యూజిలాండ్‌లు కలిగి ఉన్నాయి. ఈ బంధాలను మరింత బలోపేతం చేయడంలో.. రెండు దేశాలలోని వ్యాపారాలు, ప్రజలకు కొత్త అవకాశాలను సృష్టించడంలో ఎఫ్‌టీఏ ఒక కీలకమైన ఘట్టంగా ఉంది.

ఈ ఒప్పందం అమల్లోకి వచ్చిన తేదీ నుంచి భారత్ న్యూజిలాండ్‌కు చేసే ఎగుమతుల్లో 100 శాతం ఉత్పత్తులకు సుంకం లేని ప్రవేశం లభిస్తుంది. ఇది వస్త్రాలు, తోలు, పాదరక్షలు, ఇంజనీరింగ్ వస్తువులు, ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తులతో సహా భారతీయ ఎగుమతులకు కొత్త అవకాశాల ద్వారాలను తెరుస్తుంది. అదేవిధంగా కలప, ఉన్ని, గొర్రె మాంసం, తోలు ముడి చర్మాలతో సహా న్యూజిలాండ్ ఎగుమతులకు భారతీయ మార్కెట్‌లో మెరుగైన, ప్రాధాన్యతతో కూడిన ప్రవేశాన్ని ఇది కల్పిస్తుంది.

ఈ ఒప్పందం సేవలు, పెట్టుబడులు.. నిపుణులు, విద్యార్థులు, యువత రాకపోకలకు సంబంధించి నూతన అవకాశాలను సృష్టిస్తుంది. ఇందులో భారతీయ నిపుణులు, విద్యార్థులకు మెరుగైన మార్గాలు కూడా ఉన్నాయి. ఇది భారతదేశంలోకి 20 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడులను సులభతరం చేస్తుంది. దీనితో పాటు వ్యవసాయోత్పత్తి, ఫార్మాస్యూటికల్స్, వైద్య పరికరాలు, సంప్రదాయ వైద్యం, ఆయుష్, సాంకేతికత, వాణిజ్య సులభతర అంశాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేస్తుంది.

ఈ ఒప్పందం త్వరగా అమల్లోకి వచ్చే విధంగా దేశీయ ప్రక్రియలను పూర్తి చేయడానికి భారత్, న్యూజిలాండ్‌లు కలిసి పనిచేస్తున్నాయి.

# 2 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరు నిందితుల అరెస్ట్



కరీంనగర్, సెప్టెంబర్ 18: కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎఎఎ టౌన్ పోలీసులు, టాస్క్ ఫోర్స్ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్ లో సుమారు 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులని అదుపులోకి తీసుకున్నారు.

టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టాస్క్ ఫోర్స్ ఏసీపీ సతీష్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని వరాహస్వామి ఆలయం సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న సయ్యద్ ముబీన్ (34, హౌసింగ్ బోర్డు కాలనీ), మహమ్మద్ యూనస్ (29, అజ్మత్ పురా) లను పట్టుకుని వారి వద్ద ఉన్న గంజాయి, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

నిందితులు గంజాయిని నాగ్ పూర్ నుండి కొనుగోలు చేసి తీసుకొచ్చినట్లు, తమ అవసరాలతో పాటు కరీంనగర్ పరిసరాల్లో విక్రయించేందుకు తెచ్చినట్లు విచారణలో వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆపరేషన్ లో పాల్గొన్న ఇన్స్పెక్టర్ జి.తిరుమల్, ఎస్సైలు చీరలు, శ్రీకాంత్, సురేందర్ తదితర సిబ్బందిని సీపీ గౌష్ ఆలం అభినందించారు.

# బెంగళూరులో రక్షణ మంత్రి, సమక్షంలో భారత వైమానిక దళానికి ఎల్‌సీఏ తేజస్ ఎఫ్ఓసీ ట్విన్ సీటర్ శిక్షణ విమానాలు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 18:భారత వైమానిక దళం (ఐఏఎఫ్) కోసం తయారు చేసిన లైట్ కాంన్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 18:బాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎల్‌సీఏ) తేజస్ ఫైనల్ ఆపరేషనల్ క్లియరెన్స్ (ఎఫ్ఓసీ) ట్విన్ సీటర్ ట్రైనర్ విమానాలనూ, హెచ్‌టీటీ - 40 బేసిక్ ట్రైనర్ విమానాలనూ, పవన్ హన్స్ లిమిటెడ్ (పీహెచ్ఎల్) కోసం తయారు చేసిన ధ్రువ్ నెక్స్ట్ జనరేషన్ హెలికాప్టర్లనూ సెప్టెంబర్ 18, 2026న కర్ణాటకలోని బెంగళూరులో రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన మంత్రి శ్రీ కె. రామ్మోహన్ నాయుడు సమక్షంలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) అందజేయనుంది. ఈ విమానాలను, హెలికాప్టర్లను అందజేయడం దేశ స్వావలంబన ప్రస్థానంలో కీలక మైలురాయిగా నిలవనుంది. దేశీయ ఏరోస్పేస్ వ్యవస్థను బలోపేతం చేయడంలో హెచ్ఏఎల్, దాని పారిశ్రామిక భాగస్వాములు పోషిస్తున్న పాత్రను ఈ కార్యక్రమం చాటిచెప్పనుంది. పౌర, సైనిక అవసరాల కోసం అధునాతన వేదికల రూపకల్పన, అభివృద్ధి, తయారు చేసే సామర్థ్యాన్ని, దేశీయ పరిశ్రమ విస్తరిస్తున్న తీరును కూడా ఈ కార్యక్రమం ప్రతిబింబించనుంది.

వైమానిక దళం ప్రధానాధికారి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, రక్షణ ఉత్పత్తుల విభాగం కార్యదర్శి శ్రీ సంజీవ్ కుమార్, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సమీర్ కుమార్ సిన్హా, హెచ్ఏఎల్ సీఎండీ శ్రీ కే. రవితో పాటు రక్షణ మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, భారత వైమానిక దళం, పవన్ హన్స్ లిమిటెడ్, నియంత్రణ సంస్థలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఏరోస్పేస్, రక్షణ రంగాల భాగస్వాములు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో దేశీయంగా రూపకల్పన, అభివృద్ధి, తయారీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ వేదికలను సాయుధ బలగాలు, సంబంధిత సంస్థల్లో ప్రవేశపెట్టడం దేశీయ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, విదేశీ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించే దిశగా మరో ముందడు

# అమీనాపూర్‌లో భూభారతి రీ-సర్వేపై అవగాహన

## రైతులు సద్వినియోగం చేసుకోవాలి: సబ్ కలెక్టర్ అభినవ్ మాల్వియా



నిజామాబాద్, సెప్టెంబర్ 18:: నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామంలో భూభారతి రీ-సర్వేపై శుక్రవారం గ్రామస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుండె సౌందర్య నవీన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభినవ్ మాల్వియా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రీ-సర్వే కార్యక్రమం ప్రాధాన్యతను రైతులకు వివరించారు. గతంలో భూ రికార్డుల్లో ఉన్న లోపాలను సరిదిద్దడం, సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడం, ప్రతి ఎకరాకు ఖచ్చితమైన కొలతలతో కూడిన పటాలను రూపొందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

రీ-సర్వే ద్వారా రైతులకు తమ భూమిపై భరోసా, భద్రత లభిస్తుందని, భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ఉంటాయని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే బృందం వచ్చినప్పుడు రైతులు తమ పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డులతో హాజరై సహకరించాలని కోరారు. తమ భూముల హద్దులను సర్వే బృందానికి స్పష్టంగా చూపించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, డీఆర్డీవో, నాయబ్ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ గోపాల్, వేల్పూర్ సర్వేయర్ నాయక్, ఉప సర్పంచ్ స్వామి గౌడ్, రీ-సర్వే బృందం సభ్యులు, కార్యదర్శి గణేష్, జీపీఓ వినోద్‌కు, గ్రామస్తులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 22ఏ జాబితా నుంచి పేదల భూములను తొలగించాలి

నల్గొండ, సెప్టెంబర్ 18:: 22ఏ (నిషేధిత భూముల) జాబితా నుంచి పేదల భూములను వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిషేధిత భూముల జాబితా కారణంగా రాష్ట్రంలో వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వంపై విమర్శలు చేశారు. "నిషేధిత జాబితా నుంచి పేదల భూములను తొలగించడం చేతకాని ప్రభుత్వం కొత్తగా భూ సర్వేలు నిర్వహించడం ఎందుకు?" అని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి హక్కులు అనుభవిస్తున్న భూములను 22ఏ జాబితాలో చేర్చడం వల్ల పేదలు తమ అవసరాల కోసం వాటిని విక్రయించుకోలేకపోతున్నారని తెలిపారు. క్రయవిక్రయాలు నిలిచిపోవడంతో బాధితులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

# అప్పు విషయంలో అవమానం.. వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్, సెప్టెంబర్ 18: అప్పు విషయంలో అవమానానికి గురై తీవ్ర మనస్తాపానికి లోనైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఇన్‌స్పెక్టర్ అనుముల నిరంజన్‌రెడ్డి తెలిపారు.

పోలీసుల వివరాల ప్రకారం.. ఇరుకుల గ్రామానికి చెందిన బిజిలి రాజయ్య (45) తన కుమార్తె వివాహం కోసం రెండేళ్ల క్రితం గర్రెపల్లికి చెందిన బిజిలి మల్లయ్య వద్ద రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. అప్పు తిరిగి చెల్లించడంలో ఆలస్యం కావడంతో మల్లయ్య నుంచి రాజయ్యకు ఇబ్బందులు ఎదురైనట్లు పోలీసులు తెలిపారు.

# పిడుగుపాటుకు పాడి గేదె మృతి

## రూ.1.20 లక్షల నష్టం.. 20 ఏళ్లుగా పశువులపై ఆధారం పాడి గేదె మృతితో కన్నీరుమున్నీరైన రైతు మహేష్.. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

హైదరాబాద్, సెప్టెంబర్ 18: మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షంతో పిడుగుపాటు సంభవించి పాడి రైతు దుమాల మహేష్‌కు చెందిన పాడి గేదె మృతి చెందింది. భారీ వర్షం సమయంలో పిడుగు పడటంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సుమారు రూ.1.20 లక్షల విలువైన పాడి గేదెను కోల్పోయి రైతు మహేష్ తీవ్రంగా నష్టపోయారు.

రైతు మహేష్ గత 20 సంవత్సరాలుగా పశువుల పెంపకంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయంతో పాటు పాడి పశువులను పెంచుకుంటూ వచ్చినట్లు చెప్పారు. కుటుంబ అవసరాలకు, పిల్లల చదువులు, ఇతర ఖర్చులకు వ్యవసాయం తో పాటు పాడి పశువుల ద్వారా వచ్చే ఆదాయం ఎంతో ఉపయోగపడేదని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎంతో జాగ్రత్తగా పెంచుకున్న గేదె ఒక్కసారిగా పిడుగుపాటుకు మృతి చెందడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. పాడి గేదె మృతితో కుటుంబానికి ఆర్థికంగా పెద్ద దెబ్బ తగిలిందని మహేష్ కన్నీరుమున్నీరయ్యారు. ఇప్పటికే పశువుల పెంపకం కోసం చేసిన ఖర్చులు, వాటి సంరక్షణకు చేసిన శ్రమ అంతా వృథా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాడి గేదె ద్వారా వచ్చే ఆదాయాన్ని కోల్పోవడంతో కుటుంబ పోషణ కూడా ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. పిడుగుపాటుతో పశువును కోల్పోయిన తన కుటుంబాన్ని ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలని రైతు మహేష్ కోరారు. అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన నష్టపరిహారం అందించి తన కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.



# ప్రాథమిక ఉపాధ్యాయ విద్యలో 6 నెలల సర్టిఫికెట్ కోర్సును (బ్రిడ్జ్) ప్రారంభించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 18: న్యూఢిల్లీలో 2026 సెప్టెంబర్ 16న ప్రాథమిక ఉపాధ్యాయ విద్యలో (పీటీఈ) ఆరు నెలల సర్టిఫికెట్ (బ్రిడ్జ్) కోర్సును కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి ప్రారంభించారు. బీఎడ్ అర్హత కలిగి, ప్రస్తుతం విధుల్లో ఉన్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కోసం ఈ కోర్సును ప్రత్యేకంగా రూపొందించారు. ప్రాథమిక స్థాయిలో బోధన ధ్రువీకరణ పత్రాన్ని పొందడానికి, ఈ కోర్సు ఉపాధ్యాయులకు కీలక మార్గంగా ఉపయోగపడుతుంది. ఈ వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమం ద్వారా ప్రాథమిక స్థాయి (1 నుంచి 5 తరగతులు) విద్యార్థులకు సమర్థవంతంగా బోధించేలా, ఉపాధ్యాయుల్లో అవసరమైన నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించడానికి సమగ్ర శిక్షణను అందిస్తుంది.

ఈ బ్రిడ్జ్ కోర్సును జాతీయ సార్వత్రిక పాఠశాల విద్యా సంస్థ (ఎన్ఐఓఎస్) అమలు చేస్తుంది. ఇది శిశు కేంద్రీకృత సమ్మిళిత, వయోవికాసానికి అనుగుణమైన బోధన పద్ధతుల్లో ఉపాధ్యాయులను సన్నద్ధం చేస్తూ, పునాది, ప్రాథమిక దశల్లో విద్యా నాణ్యతను మరింత పటిష్టం చేస్తుంది.

జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్సీటీఈ ) మార్గదర్శకాల ప్రకారం రూపొందించిన ఈ కోర్సు.. విద్యాపరమైన అభ్యాసంతోపాటు కనీసం 10 రోజుల ఆన్‌లైన్ ప్రత్యక్ష తరగతులు, కనీసం 20 రోజుల పాఠశాల ఆధారిత అనుభవం ద్వారా ప్రాథమిక దశ బోధనా సామర్థ్యాలను బలోపేతం చేస్తుంది.

చిన్న పిల్లల వైవిధ్యభరితమైన అభ్యాస అవసరాలను తీర్చడంలో ఈ కోర్సు ఉపాధ్యాయులకు తోడ్పడుతుంది. ఆరు సిద్ధాంత కోర్సులు, పాఠశాల ఆధారిత ప్రాక్టికల్‌తో కూడిన ఈ కార్యక్రమం.. విద్యా రంగానికి సంబంధించిన సిద్ధాంతాలను తరగతి గది బోధన పద్ధతులతో అనుసంధానించడానికి ఒక బలమైన వ్యవస్థను అందిస్తుంది. ప్రాథమిక తరగతుల్లోని పిల్లలందరికీ నాణ్యమైన విద్య, నిరంతర అభ్యాసాన్ని అందించడానికి అవసరమైన నైపుణ్యాలు, సానుకూల దృక్పథం, విశ్లేషణాత్మక సామర్థ్యాలతో ప్రాథమిక ఉపాధ్యాయులను సాధికారత వైపు నడిపించడమే ఈ బ్రిడ్జ్ కోర్సు ముఖ్య లక్ష్యం. బోధనా వృత్తిని నిరంతర చైతన్యవంతమైనదిగా, సందర్భానుసారమైన, పరిశోధనాత్మకమైనదిగా తీర్చిదిద్దే దృక్పథాన్ని ఇది ప్రోత్సహిస్తుంది.

దేవేష్ శర్మ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, ఇతరులు కేసులో సివిల్ అప్పీల్ నంబర్ 5068/2023లో భారత సుప్రీం కోర్టు 2024 ఏప్రిల్ 8న ఇచ్చిన తీర్పు ద్వారా డీ.ఎల్.ఎడ్ అర్హత లేకుండా ప్రాథమిక ఉపాధ్యాయులుగా నియమితులైన వారి కోసం ప్రత్యేక బ్రిడ్జ్ కోర్సును రూపొందించే అధికారాన్ని జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలికి (ఎన్సీటీఈ) కల్పించింది.

దీని ప్రకారం 2018 జూన్ 28 నుంచి 2023 ఆగస్టు 11 మధ్య బీఎడ్ అర్హతతో ప్రాథమిక స్థాయిలో (1–5 తరగతులు) బోధించడానికి నియామకమైన ఉపాధ్యాయుల కోసం ఈ బ్రిడ్జ్ కోర్సు రూపొం దించారు.

2018 జూన్ 28 నాటి ఎన్సీటీఈ గెజిట్ నోటిఫికేషన్ (ఎఫ్. నెంబర్ ఎన్సీటీఈ రిజిస్ట్రేషన్. 012/2018) కింద నియామక రక్షణ పొందిన ఉపాధ్యాయులకు ఈ కోర్సు ప్రత్యేకంగా వర్తిస్తుంది.

ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రాథమిక విద్యా సూత్రాల లక్ష్యంగా సిద్ధాంతపరమైన, ఆచరణాత్మక అంశాలు రెండూ ఉంటాయి. బోధన మాధ్యమం హిందీ, ఆంగ్ల భాషల్లో ఉంటుంది. అయితే రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో పేర్కొన్న 22 అధికారిక భాషల్లో దేనిలోనైనా పబ్లిక్ పరీక్ష రాయడానికి ఉపాధ్యాయులకు అనుమతి ఉంటుంది. ఈ కోర్సును బహిరంగ మాధ్యమ (ఓడీఎల్) విధానంలో అందిస్తారు. ఇందులో ప్రత్యక్ష కార్యక్రమాలు, పాఠశాల ఆధారిత ప్రాక్టికల్స్ (బోధనా అభ్యాసం, రిఫ్లెక్టివ్ జర్నల్స్, పోర్ట్‌ఫోలియోలు), వీడియో ట్యుటోరియల్స్, ఈ–లెర్నింగ్ మెటీరియల్స్, డిజిటల్ వేదికలు కూడా ఉంటాయి. ఈ విధానం వల్ల విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు తమ వృత్తిపరమైన బాధ్యతలను నిర్వహిస్తూనే, పాఠ్యాంశాలను చురుగ్గా నేర్చుకోవడానికి వీలు కలుగుతుంది.

ఈ కోర్సు ప్రవేశాలు ఎన్ఐఓఎస్ అధికారిక బ్రిడ్జ్ కోర్సు వేదిక ద్వారా ఆన్‌లైన్‌లో జరుగుతాయి. అర్హులైన ఉపాధ్యాయులు దీనికోసం కేటాయించిన డాష్‌బోర్డ్ ద్వారా నమోదు చేసుకోవడం, అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేయడం, ప్రవేశ స్థితిని పరిశీలించుకోవడం చేయవచ్చు.

స్వయం అభ్యాస సామగ్రితో సహా పాఠ్యాంశాలన్నీ డిజిటల్ రూపంలోనే అందిస్తారు. ఉపాధ్యాయుల అభ్యాస అనుభవాన్ని మెరుగుపరచడానికి ఆడియోలు, వీడియోలు, ఇంటరాక్టివ్ కంటెంట్ వంటి అదనపు వనరులను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు.

# యంయంసీయూ ఆస్పత్రిని ప్రారంభించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 18: ఆంధ్రప్రభ: మహబూబ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన యంయంసీయూ ఆస్పత్రిని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, సౌకర్యాలను ఆయన పరిశీలించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ కే. వినోద్ కుమార్ గౌడ్, ఎస్. రాహుల్, జి. నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా పలువురు స్థానికులు, వైద్య సిబ్బంది పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై అత్యవసర సమావేశం..

ఆదిలాబాద్, సెప్టెంబర్ 18: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ అంకం మౌనిక మహేందర్ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. గణేష్ నిమజ్జనానికి సంబంధించిన విధి దీపాల ఏర్పాటు, రోడ్ల మరమ్మతులు, విద్యుత్ సరఫరా తదితర తాత్కాలిక ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు.

వినాయక శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని చైర్‌పర్సన్ అంకం మౌనిక సూచించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షోయబ్ హుస్సేన్, కౌన్సిలర్లు గుమ్ముల శోక్, బొప్పరపు సత్యవతి, బండిపెల్లి సింధుజ, తొడసం ఇందిర, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వేయిస్తంభాల ఉత్తిష్ఠగణపతికి లక్ష పుష్పార్చన

హన్మకొండ, సెప్టెంబర్ 18:(నేటినిజం ప్రతినిధి) చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో ఉత్తిష్ఠ గణపతి నవరాత్రి ఉత్సవాలు 5వ రోజు ఉదయం ఉత్తిష్ఠ గణపతికి కాకతీయుల కాలం నాటి ప్రాచీనకోనేరు తీర్థ బిందాభిషేకం గందోధికాభిషేకం నిర్వర్తించి స్వామివారిని శుక్రవారం సర్ప గణపతిగా అలంకరించారు. ప్రముఖ శివ భక్తురాలు మంజుల అందించిన ఆంధ్ర రాజధాని అమరావతిలోగల కాలేశ్వరరావు మార్కెట్ నుంచి తెప్పించిన మల్లె, గులాబీ, చామంతి, ఎర్రగులాబి, పసుపుగులాబీ లక్షగణపతి నామాలతో లక్ష పుష్పార్చన నిర్వర్తించారు.

అనంతరం స్వామివారిని పద్మ వాహనంపై వాహనసేవ నిర్వర్తించారు. పూజా దాతలుగా ప్రముఖ వస్త్ర వ్యాపారి మహేంద్ర కపూర్ రాజ్ కరాని ఉభయదాతలుగా వ్యవహరించారు. సాయంత్రం దేవులపల్లి శ్రీవిద్య శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వర్తించారు. శుక్రవారం కావడంతో వేలాదిగా భక్తులు దేవాలయాన్ని సందర్శించి గణపతి నామస్మరణ చేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో డి.అనిల్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. గంగపుత్ర సంఘం జిల్లా నాయకుడు గరిగ అశోక్, అంబటి రాజు అన్నదాన సేవలో పాల్గొని సేవలందించారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, మణికంఠశర్మ, ప్రణవ్‌శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.




# యూపీఐ పన్ను.. సామాన్యులపై కొత్త బాదుడు

## –సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో ఆందోళన



ఖమ్మం, సెప్టెంబర్ 18: కేంద్ర ప్రభుత్వం యూపీఐ లావాదేవీలపై విధించిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ పన్నును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో శుక్రవారం జూలూరుపాడు బస్టాండ్ సెంటర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ?ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోతు కృష్ణ మాట్లాడుతూ.. దేశంలో డిజిటల్ విప్లవానికి మారుపేరుగా నిలిచిన యూపీఐ చెల్లింపులపై పన్ను విధించడం సామాన్యుల నడ్డి విరవడమేనని విమర్శించారు. కేవలం అమెరికన్ కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన ఆరోపించారు. వాణిజ్య లావాదేవీలపై విధించే అతి స్వల్ప పన్ను మాత్రమేనని ప్రభుత్వం సమర్థించుకోవడం హాస్యాస్పదమన్నారు. వ్యాపారులు ఈ పన్ను భారాన్ని అంతిమంగా వినియోగదారుల నుంచే ముక్కు పిండి వసూలు చేస్తారన్న కనీస వాస్తవాన్ని కేంద్రం విస్మరించడం శోచనీయమన్నారు. ఈ నిర్ణయం వల్ల దేశ ప్రజలపై సుమారు రూ. 30 వేల కోట్లకు పైగా అదనపు భారం పడనుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలో బ్రిటిష్ వాళ్లు భారతీయులకు ఉచితంగా టీ, కాఫీలు అలవాటు చేసి ఆ తర్వాత లక్షల కోట్ల వ్యాపారం చేసిన తరహాలోనే.. నేడు అమెరికన్ యూపీఐ కంపెనీలు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. పదేళ్ల పాటు ఉచిత సేవలు అందించి ప్రజలందరికీ అలవాటు చేసిన తర్వాత, నేడు వాణిజ్య లావాదేవీల పేరుతో మొదలుపెట్టి భవిష్యత్తులో సామాన్యులపైనా నేరుగా పన్నుపోటు పొడిచే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులు దేశ అభివృద్ధికి ఉపయోగపడకపోగా, ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. మోదీ పాలనలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుంటే, ప్రజల ఆదాయాలు పాతాళానికి పడిపోయాయని.. ఈ తరుణంలో యూపీఐపై పన్ను వేయడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మారిందని విమర్శించారు. తక్షణమే ఆన్‌లైన్ లావాదేవీలపై విధించిన పన్నును రద్దు చేసి, డిజిటల్ చెల్లింపులను మరింత సరళతరం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకుడు ఎద్దులాపురం గోపాలరావు, మండల నాయకుడు బానోత్ ధర్మ, ఏఐయూకేఎస్ నాయకుడు రాజశేఖర్, మండల కార్యదర్శి తోటకూరి నరేష్, బైరు వెంకన్న, మండల నాయకులు రాయల శ్రీను, భద్రు, దీప్లా, కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# హరీశ్‌రావు మామ భూముల పరిశీలన!

## -రెవెన్యూ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు



మెదక్, సెప్టెంబర్ 18: సిద్దిపేట జిల్లా భూముల వ్యవహారం రాజకీయంగా మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూముల పరిశీలనలో భాగంగా కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీల బృందం శుక్రవారం సిద్దిపేట జిల్లాకు చేరుకుంది. అసెంబ్లీ నుంచి ప్రత్యేక బస్సులో బయలుదేరిన ఈ బృందం మార్గమధ్యలో వెలికట్ట వద్ద ఆగి.. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మామ హనుమంతరావుకు సంబంధించిన భూములను పరిశీలించింది.

సిద్దిపేట, ఎర్రవల్లి ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేతలు పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా వెలికట్ట వద్దకు చేరుకున్న బృందం అక్కడి భూముల వివరాలను పరిశీలించింది. అనంతరం రెవెన్యూ అధికారుల నుంచి సంబంధిత భూములకు సంబంధించిన రికార్డులు, వివరాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. హరీశ్‌రావు మామ హనుమంతరావు పేరుతో ఉన్న భూముల అంశాన్ని కూడా కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. ఈ భూములకు సంబంధించిన రికార్డులు, వాటి స్వరూపం తదితర వివరాలపై అధికారులతో చర్చించినట్లు తెలుస్తోంది.

ఇటీవల ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లోని భూముల వ్యవహారం రాజకీయ దుమారం రేపుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నేతల సిద్దిపేట పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఎర్రవల్లి, వెంకటాపూర్ ప్రాంతాల్లోని ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలను పరిశీలించేందుకు రెవెన్యూ అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించారు. సర్వే నంబర్ల వారీగా భూముల రికార్డులను పరిశీలిస్తూ ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిస్థితిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. ఎర్రవల్లి పరిధిలోని భూములపై సమగ్ర నివేదిక సిద్ధం చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.

కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూముల అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించారు. ఎర్రవల్లి, మిట్టపల్లి, వెంకటాపూర్ తదితర ప్రాంతాల్లో భూముల వివరాలను ఆయన సభలో వెల్లడించారు. హరీశ్‌రావు, ఆయన భార్య పేర్లపై కూడా భూములు ఉన్నట్లు సీఎం పేర్కొన్నారు. ఎర్రవల్లి ప్రాంతంలోని భూములపై విచారణ జరిపి, ప్రభుత్వ భూముల వివరాలను తేల్చేందుకు 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు వార్తలు వెలువడ్డాయి. దీంతో రెవెన్యూ యంత్రాంగం రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి సర్వేను ముమ్మరం చేసింది. భూముల పరిశీలన నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు మరింత తీవ్రంగా మారుతున్నాయి. కాంగ్రెస్ నేతలు భూముల వ్యవహారంపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు. మరోవైపు హరీశ్‌రావు తన భూములు, ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో ఇప్పటికే వెల్లడించామని, తన జీవితం తెరిచిన పుస్తకమని చెబుతున్నారు. కాంగ్రెస్ నేతలు వస్తే తానే దగ్గరుండి తన భూములు చూపిస్తానని కూడా ఆయన పేర్కొన్నారు.

# ఆర్ఐఎన్ఎల్ భూముల ఈ-వేలం సందర్భంగా పెట్టుబడిదారులతో ముందస్తు సమావేశాలు నిర్వహించనున్న ఎన్ఎల్ఎంసీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల విభాగం పరిపాలనా నియంత్రణలో ఉన్న నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎంసీ), రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్ – విశాఖపట్నం స్టీల్ ప్లాంట్)కు చెందిన 459 ప్లాట్ల ఈ – వేలానికి సంబంధించి ప్రజలకు సమాచారం అందించే కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం, హైదరాబాద్, విజయవాడలో వరుసగా పెట్టుబడిదారుల సమావేశాలు నిర్వహించనుంది.

పెట్టుబడిదారుల సమావేశాలు 2026 సెప్టెంబర్ 23న విశాఖపట్నం, సెప్టెంబర్ 24న విజయవాడ, సెప్టెంబర్ 25న హైదరాబాద్ లో జరుగుతాయి.

ఆసక్తి ఉన్న పెట్టుబడిదారులు, డెవలపర్లు, ఇతర అర్హత కలిగిన భాగస్వాములకు భూముల వివరాలు, వేలం ప్రక్రియ, బిడ్డింగ్ నిబంధనలు, ఇతర సంబంధిత అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు, సంబంధిత భాగస్వాములతో నేరుగా చర్చించే అవకాశం కల్పించడం ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశం.

ఆర్ఐఎన్ఎల్ కు చెందిన భూముల్లో విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ, మద్దిలపాలెం, ఆటోనగర్, గాజువాక ప్రాంతాల్లోని 93,572.21 చదరపు గజాల విస్తీర్ణంలో 459 ప్లాట్లు ఉన్నాయి. ఒక్కో ప్లాట్ విస్తీర్ణం సుమారు 128.94 చదరపు గజాల నుంచి 2,728 చదరపు గజాల వరకు ఉంది.

ఈ భూముల్లో ప్రధాన భాగంగా హెచ్‌బీ కాలనీలో 87,949.77 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 456 నివాస ప్లాట్లు ఉన్నాయి. గాజువాకలోని ఆటోనగర్‌లో 5,622.44 చదరపు గజాల విస్తీర్ణంలో మరో మూడు ప్లాట్లు ఉన్నాయి. విశాఖపట్నంలో ఇప్పటికే వ్యూహాత్మకంగా అభివృద్ధి చెందిన నివాస, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ ఆస్తులు ఉన్నాయి. పారదర్శక, పోటీతో కూడిన ఈ – వేలం ప్రక్రియ ద్వారా వీటిని విక్రయించనున్నారు.

వేలానికి సంబంధించిన నిబంధనలు, షరతులకు లోబడి ఈ భూములను ఎటువంటి వివాదాలు లేదా చట్టపరమైన చిక్కులు లేని స్పష్టమైన ప్రభుత్వ హక్కులతో అందుబాటులో ఉంచుతున్నారు. ఈ ప్రక్రియకు లావాదేవీ సలహాదారుగా క్వికర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (క్యూఐపీఎల్)ను నియమించారు.

రైల్‌టెల్ ఈ – నివిదా ఈ?ప్రొక్యూర్‌మెంట్ వేదిక ద్వారా రెండు విడతల్లో ఈ – వేలం నిర్వహించనున్నారు. మొదటి విడత ఈ–వేలం 2026 అక్టోబర్ 12న జరుగుతుంది. ఇందులో 243 ప్లాట్లు ఉన్నాయి. మొదటి విడతకు రిజిస్టర్ చేసుకోవడంతో పాటు ఈఎండీ (ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) సమర్పించేందుకు 2026 అక్టోబర్ 8 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది.

రెండో విడత ఈ – వేలం 2026 అక్టోబర్ 16న నిర్వహించనున్నారు. ఇందులో 216 ప్లాట్లు ఉన్నాయి. రెండో విడతకు రిజిస్టర్ చేసుకోవడంతో పాటు ఈఎండీ సమర్పించేందుకు 2026 అక్టోబర్ 14 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది. ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ ను ప్రతి ప్లాట్‌కు రూ. 2 లక్షలుగా నిర్ణయించారు. ఆసక్తి ఉన్న బిడ్డర్లు నిర్దేశించిన గడువులోగా రిజిస్టర్, కేవైసీ ప్రక్రియ, ఈఎండీ చెల్లింపును పూర్తి చేయాలి.

ప్లాట్ల వివరాలు, రిజర్వ్ ధరలు, అర్హత ప్రమాణాలు, బిడ్డింగ్ ప్రక్రియ, రిజిస్ట్రేషన్ నిబంధనలు, ఇతర షరతులు, నిబంధనలకు సంబంధించిన సమగ్ర సమాచారం అధికారిక వేలం పత్రాల్లో అందుబాటులో ఉంది. పెట్టుబడిదారుల సమావేశాల ద్వారా ఆసక్తి ఉన్న భాగస్వాములు ఈ / వేలంలో పాల్గొనే ముందు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు, వేలం ప్రక్రియపై పూర్తి అవగాహన పొందే అవకాశం కూడా లభిస్తుంది.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు చెందిన మిగులు భూములను, ఇతర ప్రధానేతర ఆస్తులను వృత్తిపరమైన, క్రమబద్ధమైన, పారదర్శక విధానంలో విక్రయించే బాధ్యతలో భాగంగా ఎన్ఎల్ఎంసీ ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది.

పెట్టుబడిదారుల సమావేశాలు, ఆర్ఐఎన్ఎల్ భూముల ఈ – వేలం, సంబంధిత ప్రకటనలపై తదుపరి సమాచారం కోసం ఆసక్తి ఉన్న పెట్టుబడిదారులు, ఇతర భాగస్వాములు తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలను అనుసరించాలని ఎన్ఎల్ఎంసీ సూచించింది.

నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎంసీ) 100 శాతం భారత ప్రభుత్వ యాజమాన్య సంస్థ. ఇది ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల విభాగం పరిపాలనా నియంత్రణలో పనిచేస్తోంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు చెందిన మిగులు భూములు, ఇతర ప్రధానేతర ఆస్తులను క్రమబద్ధమైన, వృత్తిపరమైన విధానంలో విక్రయించే ప్రక్రియకు వీలు కల్పించే లక్ష్యంతో ఎన్ఎల్ఎంసీని ఏర్పాటు చేశారు.

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు కార్పొరేట్ సంస్థ అయిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్), భారత ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వ శాఖ పరిధిలోని నవరత్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.

# ఈదురుగాలులకు ఇంటిపై కూలిన భారీ వృక్షం

ఖమ్మం, సెప్టెంబర్ 18: గురువారం సాయంత్రం ఒక్కసారిగా వచ్చిన ఈదురు గాలులకు ఓ ఇంటిపై భారీ వృక్షం కూలింది. దీంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోతే పట్టీనగర్‌లో ప్రధాన రహదారి పక్కనే ఉన్న మడకం లక్ష్మి ఇంటిపై ఈదురు గాలులకు పక్కనే ఉన్న భారీ వృక్షం విరిగి ఆ ఇంటిపై పడింది. దీంతో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో పాటు ఇంటి గోడలు, రేకులు పూర్తిగా విరిగిపోయాయి. ఈ ఘటన జరిగి గంటలు దాటినప్పటికీ పంచాయతీ సిబ్బంది స్పందించకపోవడంతో నిరుపేద కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంది.

# వాడుక భాషను విరివిగా వాడిన మేస్త్రీ తాపీ

## సెప్టెంబర్ 19...తాతాజీ తాపీ ధర్మారావు జయంతి

తాపీ ధర్మారావు నాయుడు తెలుగు రచయిత, తెలుగు భాషా పండితుడు, హేతువాది, నాస్తికుడు. ఆంధ్రులకొక మనవి, దేవాలయాలపై బూతుబొమ్మలు ఎందుకు.. పెళ్ళి దాని పుట్టు పూర్వోత్తరాలు, రాలూ రప్పలు, రాముడికి సీత ఏమవుతుంది వంటి బహు పాఠక పుస్తకాలు,సాహిత్యాం శాలపై సాహిత్య మొర్మొరాలు, పాతపాళీ, కొత్తపాళీ వంటి గ్రంథాలు, విజయవిలాస కావ్యంపై హృదయోల్లాస వ్యాఖ్య వంటి విభిన్న అంశాలపై రచనలు చేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన మాలపిల్ల, రైతుబిడ్డ మొదలైన సినిమాలకు సంభాషణలు రాశారు. తాపీ ధర్మారావు జయంతి సెప్టెంబరు 19 ని "తెలుగు మాధ్యమాల దినోత్సవం"గా కూడా జరుపు కుంటున్నారు. తాపీని గౌరవంగా 'తాతాజీ' అని పిలిచేవారు.

సాహిత్యం, సినిమా, పత్రికలు, అధ్యాపకత్వం - ఇన్ని రంగాల్లో ఏకకాలంలో కృషి చేసిన అభ్యుదయవాది తాపీ.

పత్రికలలో, సినిమాలలో వాడుక తెలుగు భాష ప్రవేశ పెట్టిన ఘనత తాపీ ధర్మారావుకే చెందుతుంది. అభ్యుదయ రచయితల సంఘం తొలి మహాసభలకూ ఆయనే అధ్యక్షులు. తాపీ ధర్మారావు (సెప్టెంబర్ 19, 1887 - మే 8, 1973) ప్రస్తుతం ఒరిస్సాలో ఉన్న బెర్హంపూరు (బరంపురం) లోని ఒక తెలుగు కుటుంబములో ధర్మారావు నరసమ్మ, అప్పన్న దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్యను శ్రీకాకుళంలో, మెట్రిక్యులేషన్ విజయవాడలో, పర్లాకిమిడిలో ఎఫ్.ఏ. వరకు చదువుకొని మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో చేరారు. చదివే రోజులలో వ్యవహారిక భాషావేత్త అయిన గిడుగు రామ్మూర్తి ఈయనకు గురువు కావటం విశేషం. వీరి అప్పన్న తాత లక్ష్మయ్య కొంతకాలం మిలిటరీలో పనిచేసి, తరువాత తాపీ పనిలో మంచి పేరు తెచ్చుకొన్నారు. అలా శ్రీకాకుళంలో "తాపీ లక్ష్మయ్య" అన్న పేరు స్థిరపడి పోయిందట. అలా వీరి ఇంటిపేరు తాపీ గా మారింది.

చిన్నప్పుడు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడి, ఉపాధ్యాయ వృత్తి చేపట్టి, క్రమంగా యెదిగిన వ్యక్తి ఆయన. కల్లికోట రాజావారి కళాశాలలో గణిత ఉపాధ్యా యులుగా పని చేశారు. 1910 ప్రాంతంలో కొందరు మిత్రులతో కలిసి బరంపురంలో వేగుచుక్క గ్రంథమాలను స్థాపించారు. ఇతని తొలి రచన 1911లో 'ఆంధ్రులకొక మనవి' అనే పేరుతో వెలువడింది.

పత్రికా నిర్వహణలో ఆయన నేర్పు అనన్య సామాన్యం.1930 జూన్‌లో జస్టిస్ పార్టీ వారి పత్రిక 'సమదర్శిని'లో సంపాదకులుగా, 1935-'36లో



గూడవల్లి రామబ్రహ్మం సారథ్యం లోని 'ప్రజామిత్ర' పత్రికలో రచయితగా, 1936లో పిఠాపురం రాజా పీపుల్స్ పార్టీ పక్షాన నెలకొల్పిన 'జనవాణి'కి ఎడిటర్‌గా పత్రికా రంగానికి తాతయ్య చేసిన సేవ, పెట్టిన ఒరవడి నేటికీ గుర్తు చేసు కుంటారు. ముందు వీర గ్రాంథిక వాదైనా, గిడుగు వారి ప్రభావంతో తర్వాత వ్యావహారిక భాషకు పట్టం కట్టారు.

సినీ రచయితగా ఆయన తొలిచిత్రం మోహినీ రుక్మాంగద (1937). ఆ పౌరాణిక చిత్రంలో ఆయన వ్యావహారిక భాషలో సంభాషణలు రాయడం అప్పట్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. 'మాలపిల్ల', 'రోజులు మారాయి' చిత్రాల రచనల్లో ఆయన అభ్యుదయ భావాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి.

1937లో సినీరంగం లో అడుగుపెట్టి మొదట మోహినీ రుక్మాంగదకు, చివరగా 1962లో భీష్మ సినిమాకు సంభాషణలు రాశారు.

చేమకూర వెంకటకవి విజయవిలాస కావ్యానికి సహృదయోల్లస వ్యాఖ్య రాసి సంప్రదాయ పండితుల ప్రశంసలందు కున్నారు.తాపీ ధర్మారావు మాలపిల్ల (1938) సినిమాకు సంభాషణలు రాయగా, కథ అందించినది గుడిపాటి వెంకటచలం. ఉమ్మడి రాష్ట్రంగా వున్న రోజుల్లో బొబ్బిలి రాజా ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నప్పుడు... ధర్మారావు ఆయన దగ్గర కార్యదర్శిగా పని చేశారు. ఆంధ్ర రాష్ట్ర పత్రికా రచయితల మహాసభ జరిగినప్పుడు ధర్మారావే తొలి అధ్యక్షులు.

శృంగేరి పీఠాధిపతులు జగద్గురు చంద్రశేఖర భారతీ శంకరాచార్యుల వారి నుండి 1926లో 'ఆంధ్ర విశారద' బిరుదు, చేమకూరి వెంకటకవి రచించిన 'విజయ విలాసం' కావ్యానికి చేసిన 'హృదయోల్లాస వ్యాఖ్య'కు 1971లో కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారము, మరెన్నో సాహిత్య పురస్కారములు పొందారు.

ఆంధ్రులకొక మనవి, దేవాలయాలపై బూతుబొమ్మలు ఎందుకు.. 1936, పెళ్ళి దాని పుట్టుపూర్వోత్తరాలు 1960,

ఇనుప కచ్చడాలు, సాహిత్య మొర్మొరాలు, రాలూ రప్పలూ, మబ్బు తెరలు, పాతపాళీ కొత్తపాళీ, ఆలిండియా అడుక్కు తినేవాళ్ళ మహాసభ, విజయ విలాసం వ్యాఖ్య, అక్షర శారద ప్రశంస, హృదయోల్లాసము, భావ ప్రకాశిక, నల్లిపై కారుణ్యము, విలాసార్జునీయము, ఘంటా న్యాయము, అనా కెరినీనా, ద్యోయానము, భిక్షాపాత్రము, ఆంధ్ర తేజము, తప్తాశ్రుకణము తదితర రచనలు చేశారు.

ధర్మా రావు 1973 మే 8న మరణించారు. తెలుగు సినిమా దర్శకులు తాపీ చాణక్య ఆయన కుమారుడు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# లండన్‌లో ఘనంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 18:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని లండన్‌లో ఆది అభిమానులు ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.కేక్ కట్ చేసి ఆది శ్రీనివాస్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు కొనసాగాలని ఆకాంక్షించారు.ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆది శ్రీనివాస్‌కు లండన్ నుంచి అభిమానుల జన్మదిన శుభాకాంక్షలు.

# రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ముఖ్యమంత్రి



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 18:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ లోని ముఖ్యమంత్రి ఛాంబర్ లో రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కి జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజా సేవలో నిమగ్నమై రాష్ట్ర అభివృద్ధికి, రాష్ట్రంలో ప్రజా పాలనలో భాగస్వామ్యం కావడానికి భగవంతుడు సంపూర్ణ ఆరోగ్యాలు ప్రసాదించాలని తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు..

# భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు



హైదరాబాద్, సెప్టెంబర్ 18:నిజాంపేట్ పంచాయతీ ఆఫీసు రోడ్డులోని మనోహరం ఎన్‌క్లేవ్‌లో వినాయక చవితి వేడుకలు ధూంధాంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అపార్ట్మెంట్‌లోని మహిళలు ఐదో రోజు శుక్రవారం మహాలక్ష్మిదేవికి భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, నగరంలో నెలకొన్న మంచినీటి సమస్యకు ఒక పరిష్కారం చూపాలని వేడుకున్నారు. ఆదివారం వినాయక విగ్రహ నిమజ్జనం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# వైద్యుల రక్షణకు 'ఓజోన్ షీల్డ్'

### భద్రత, న్యాయ సహాయం, మానసిక మద్దతు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమం




హైదరాబాద్, సెప్టెంబర్ 18:వైద్యుల భద్రత, సంక్షేమం కోసం ఓజోన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ 'ఓజోన్ షీల్డ్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. వైద్యులపై పెరుగుతున్న దాడులు, వేధింపులు, ఆధారరహిత న్యాయ కేసుల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంస్థ తెలిపింది. పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్, మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ కిరణ్ బేడీ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.దేశవ్యాప్తంగా 1,500 మందికి పైగా ఆరోగ్య కార్యకర్తలపై ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి, వీఎంఎంసీ నిపుణులు నిర్వహించిన సర్వేలో 78.4 శాతం మంది విధుల్లో బెదిరింపులు ఎదుర్కొన్నట్లు, 58.2 శాతం మంది పని ప్రదేశంలో సురక్షితంగా లేమని భావిస్తున్నట్లు వెల్లడైందని సంస్థ పేర్కొంది. ఈ నేపథ్యంలో వైద్యులకు అండగా నిలిచేందుకు 'ఓజోన్ షీల్డ్'ను రూపొందించినట్లు తెలిపింది.ఓజోన్ ఫార్మాస్యూటికల్స్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ సుభాష్ సెహగల్ మాట్లాడుతూ.. "వైద్యులు హింస, అనవసర న్యాయ వేధింపులకు గురైనప్పుడు వారికి అండగా నిలవడం మా బాధ్యత. వైద్యులను రక్షించడమే ఓజోన్ షీల్డ్ ప్రధాన లక్ష్యం. వైద్య రంగానికి ఏదైనా తిరిగి

# రూ.14 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన తహసీల్దార్

ములుగు, సెప్టెంబర్ 18:(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా గోవిందరావుపేట తహసీల్దార్ సృజన్‌కుమార్ రూ.14 వేల లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు పట్టుకున్నారు. భూమి పౌతి మార్పిడి ప్రక్రియ కోసం లంచం డిమాండ్ చేసిన ఫిర్యాదుపై ఏసీబీ అధికారులు ముందస్తు ప్రణాళికతో దాడి చేసినట్లు తెలుస్తోంది. తహసీల్దార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు, సోదాలు నిర్వహిస్తున్నారు. లంచం తీసుకున్న ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. భూమి పౌతి మార్పిడి కోసం కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు డిమాండ్ చేశారన్న ఫిర్యాదుతో ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఏసీబీ అధికారులు తహసీల్దార్ సృజన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# సమస్త జీవకోటికి నీరే ప్రాణాధారం

### నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ




రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 18:(నేటినిజం ప్రతినిధి): ప్రపంచ నీటి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడ విద్యార్థులకు నీటి పరిరక్షణ వినియోగం గురించి అవగాహన కల్పించడంలో భాగంగా స్థానిక జలశుద్ధి కేంద్రాన్ని సందర్శించనైనది. తదుపరి విద్యార్థులతో నీటి పరిరక్షణ, సంరక్షణ, పొదుపు పై ప్రతిజ్ఞ చేయించనైనది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 18న నిర్వహించబడుతుందని, దీని ముఖ్య ఉద్దేశ్యం నీటి వనరులను రక్షించడం, నీటి కాలుష్యాన్ని గుర్తించడం, నీటి నాణ్యత పై అవగాహన కల్పించడం మరియు ప్రజలను భాగస్వామ్యం చేయడమని, దీనిని మొదట 2003లో అమెరికాకు చెందిన 'క్లీన్ వాటర్ ఫౌండేషన్' ప్రారంభించిందని, ప్రస్తుతం దీనిని 'ఎర్త్ ఎకో ఇంటర్నేషనల్' నిర్వహిస్తుందని, అన్ని రకాల జీవరాసులకు నీరు చాలా అవసరమని, నీటి పర్యవేక్షణ, నీటి వనరులను రక్షించడంలో ప్రజల ప్రమేయాన్ని ప్రోత్సహించాలని, నీరు లేనిదే జీవం లేదని, భూమిపై ఉన్న సమస్త జీవకోటికి నీరే ప్రాణాధారమని, మన శరీరం సజావుగా పనిచేయాలన్నా, భూమి పచ్చగా ఉండాలన్నా నీరు అత్యంత అవసరమని, మన శరీరంలో దాపు 60% నుండి 70% వరకు నీరే ఉంటుందని, జీర్ణ క్రియకు, రక్తప్రసరణకు, శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి నీరు అవసరమని, భారతదేశం వంటి వ్యవసాయ ఆధారిత దేశాలలో పంటలు పండడానికి సాగునీరు ప్రధాన వనరు అని, నీరు లేకుంటే ఆహార కొరత ఏర్పడుతుందని, విద్యుత్ ఉత్పత్తి, వస్తువుల తయారీ, పరిశ్రమల నిర్వహణకు నీరు ఎంతో కీలకమని, భూమిపై 71 శాతం నీరు ఉన్నప్పటికీ, అందులో తాగునీరు కేవలం ఒక శాతం మాత్రమే లభ్యమవుతోందని, మిగిలినదంతా సముద్రపు ఉప్పు నీరు అని, విచ్చలివిడిగా నీటిని వృధా చేయడం, భూగర్భ జలాలు అడుగంటి పోవడం, ఫ్యాక్టరీ వ్యర్థాలు, ప్లాస్టిక్ వల్ల నదులు, చెరువులు కలుషితం కావడం వలన జల సంక్షోభం ఏర్పడుతుందని, 'ఇంటింటికి నీరు' ప్రభుత్వం అందిస్తున్నప్పటికీ ప్రజలు వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపాలని, ఇంటిలోని వృధా నీటిని మొక్కలకు ఉపయోగించాలని, చెట్లను నాటడం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, నీటిని వృధా చేయడం అంటే మన భవిష్యత్తును మనమే నాశనం చేసుకోవడమేనని, రాబోయే తరాలకు స్వచ్ఛమైన నీటిని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భారత్ లో సింధు నాగరికత, ఈజిప్టులో నైలునది నాగరికత ఇలా ప్రపంచ నాగరికతలు నది తీరాలు, నీటి వనరులకు సమీప ప్రాంతంలో విలసిల్లాయని, మన చరిత్రంతా జల వనరులతోనే ముడిపడి ఉందని, జీవం నీటితో మొదలైందని, ప్రకృతి నీటితోనే నడుస్తోందని, అభివృద్ధి జరగాలంటే నీటి వనరులు కావాలని, జీవవైవిధ్య రక్షణ, జీవం నీటితోనే సాధ్యమవుతుందని, ఇవన్నీ తెలిసి కూడా నీటిని వృధా చేస్తూ కలుషితం చేసి విషతుల్యంగా మార్చేస్తున్నామని, ప్రపంచంలో కోట్లాదిమంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడిపోతుంటే, ఉన్న నీటిని వృధాగా నేలపాలు చేస్తున్నామని, నీటి వనరులను వ్యర్థాలతో కలుషితం చేసి తాగడానికి వీల్లేని విధంగా తయారు చేస్తున్నామని, 2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమైన జలం ఉండనే ఉండదని, జనం స్నానాలు చేయడం మానేసి శరీరానికి రసాయనిక లేపనాలు పులుముకుంటారని, కెమికల్ బాత్ చేస్తారని, సరిహద్దుల్లో ఉండాల్సిన సైన్యం నీటి వనరుల చుట్టూ కాపలా ఉంటుందని, తలంటు కోవడానికి నీరు సరిపోక ప్రజలందరూ బోడి గుండుతో జీవిస్తారని, స్త్రీ పురుషులందరూ రోజు తల షేవ్ చేసుకునే పరిస్థితి వస్తుందని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితిని ఎలా ఉంటుందో అంచనా వేయొచ్చని, పరిశుభ్రమైన నీరు ఆరోగ్యానికి మేలని, నీటిని వృధా చేయకూడదని" పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, కంకెల్కార్ మోహన్, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద మరియు విద్యార్థులు పాల్గొన్నారు.


## ఆహ్వానం

శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం సౌజన్యంతో
ఎం.వి.ఆర్ ఫౌండేషన్ నిర్వహణలో
రచన సాహిత్య వేదిక, కడప మరియు
గడియారం వారి కుటుంబీకుల సంయుక్త ఆధ్వర్యంలో
'మహాకవి' డా॥ గడియారం వేంకట శేషశాస్త్రి

**45వ సాహిత్య పురస్కార ప్రదాన సభ**



డా॥ గడియారం వేంకట శేషశాస్త్రి

పురస్కార స్వీకర్త
ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు

తేది:20.09.2026, ఆదివారం
సమయం:సాయంత్రం 05-30 గంటలకు

వేదిక:శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం
సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్

మల్లిగుంట వెంకటరమణ
ఎం.వి.ఆర్. ఫౌండేషన్
సెల్: 8374822255

డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి
కార్యదర్శి, రచన సాహిత్య వేదిక
సెల్: 9966624276

స్వాగతం:
శ్రీ గడియారం వేంకట శేషశర్మ
ఉపాధ్యక్షులు, రచన సాహిత్య వేదిక, ప్రొద్దుటూరు

సభాధ్యక్షులు:
శ్రీ విహారి, రచన సాహిత్య వేదిక, అధ్యక్షులు

ప్రత్యేకాహ్వానితులు : రచన సాహిత్య వేదిక గౌరవ సలహామండలి సభ్యులు
డా॥ రేవూరు అనంత పద్మనాభరావు గారు
పూర్వ అదనపు డైరెక్టర్ జనరల్, దూరదర్శన్, ఢిల్లీ
శ్రీ గుత్తికొండ సుబ్బారావు గారు
అధ్యక్షులు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం, మచిలీపట్నం

పురస్కార స్వీకర్త :
'సారస్వత భాస్కర' ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు
విశ్వ విఖ్యాత శాస్త్రవేత్త, విద్వత్కవి, 'పంచవటి' కావ్యకర్త

విశిష్ట అతిథులు:
ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారు
పూర్వ ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్
డా॥ విల్సాల మురళీధరరావు గారు
సుప్రసిద్ధ విమర్శకులు, బహుభాషా విద్వాంసులు, 'విద్యారత్న', ఢిల్లీ
శ్రీ సుధామ గారు
సుప్రసిద్ధ జాతీయ కవి, సాహితీవేత్త, 'సప్తపది' సృజనకర్త, హైదరాబాద్
శ్రీమతి ధూళిపాళ అరుణ గారు
సుప్రసిద్ధ సాహితీ విదుషీమణి, హైదరాబాద్

ప్రశంసాపత్ర ప్రదానం : శ్రీ యం. జానకిరామ్, ఉపాధ్యక్షులు

డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి,కార్యదర్శి శ్రీ అన్నవరం రామకుమార్, కార్యవర్గసభ్యులు

కార్యక్రమ సమన్వయం :
రచన సాహిత్య వేదిక కార్యవర్గ సభ్యులు : ఎన్. సుధీర్‌రెడ్డి, ఎన్.సురేష్ కుమార్, యస్.ఆర్.ప్రతాపరెడ్డి, డా॥ మూలె రామమునిరెడ్డి, యం. రమేష్, ముడియం కిషోర్ కుమార్.


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.